# అన్నమయ్య అంతరంగంలో అలమేల్మంగ

రచన :

డాక్టర్ కేసర్ల [illegible]ాణి, ఎం.ఏ., పిహెచ్.డి.,



ప్రచురణ :

**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుపతి**

1986

# అన్నమయ్య అంతరంగంలో
# అలమేల్మంగ

గౌ॥ శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు శెట్టిగార్కి
నమస్సులతో
వ్రా
1-8-86.


రచన :

**డాక్టర్ కేసర్ల వాణి, ఎం.ఏ., పి.హెచ్.డి.,**
రీసెర్చ్ అసిస్టెంట్, అన్నమాచార్య ప్రాజెక్ట్.

సంపాదకులు :

**శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు, ఎం.ఏ.,**
[అన్నమాచార్య ప్రాజెక్టు అధికారి, తిరుమల తిరుపతి దేవస్థానములు.]



తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వాహకులగు
**శ్రీ ఎస్. లక్ష్మీనారాయణ, ఐ.ఏ.ఎస్., గారి**
అధికారమున ప్రకటింపబడినది.

**తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము**
**తిరుపతి**
1986

T. T. D. Religious Publications Series No. 297

Annamacharya Project
*Research Wing*

**ANNAMAIAH ANTARANGAMLO ALAMELMANGA**

by

Dr. K. Vani, M.A; Ph.D;

Editor : Kamisetty Srinivasulu

First Edition : 1986

*Copies :* 2,000

Published by

S. Lakshminarayana, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.


Printed at :

Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

# విషయ సూచిక


| | | పుట |
|---|---|---|
| ముందుమాట | .... | i |
| ఉపోద్ఘాతము | .... | iii |
| ఈ పుస్తకం ఒక పుష్పం | .... | ix |
| అభిప్రాయం | .... | xi |
| కృతజ్ఞతాంజలి | .... | xiii |
| అలమేల్మంగ | .... | 1 |
| అనుబంధం | .... | 40 |


———



తిరుచానూరు శ్రీ పద్మావతీదేవి

# ముందుమాట

తన ఆరాధ్యదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి మీద సుమారు 32 వేల సంకీర్తనలు రచించి ఆత్మకళ్యాణంతోపాటు లోక కళ్యాణాన్నికూడా సాధించిన మహాభాగవతోత్తముడు తాళ్ళపాక అన్నమాచార్యులు. ఆయన పద కవితలో కానవచ్చే భావబలం, భాషతీర్పు, అనుభవాలలోతు, వైవిధ్యం మరే పదకవి రచనలోను గోచరించదు.

తాళ్ళపాకవారి సంకీర్తన వాఙ్మయం మీద పరిశోధకులు ఇటీవలి కాలంలో ఎంతో నిర్మాణాత్మకమైన కృషి సాగిస్తున్నారు. అయితే భాషా సాహితీ పరిశోధకులకు ఈ వాఙ్మయం ఈతకు మించిన లోతు.

కళాప్రపంచం ఈనాడు తాళ్ళపాకవారి సంకీర్తనలపట్ల చూపిస్తున్న ఆదరాభిమానాలకు అనుగుణంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కార్యకలాపాలు మూడు కోణాలలో సాగుతున్నవి. అవి పరిశోధన—ప్రచురణ: సంకీర్తనవ్యాప్తి—సంగీతం, హరికథ, ఉత్సవాలు: రికార్డింగులు—గ్రామఫోను రికార్డులు, క్యాసెట్లు॰

అన్నమాచార్య వాఙ్మయంలో భాషా సాహిత్య పరిశోధనలు సాగించే విద్యార్థినీ విద్యార్థులకు ఉపకారవేతనాలు మంజూరు చేసి ప్రోత్సహించడమనే ప్రణాళిక క్రింద ఐదు సిద్ధాంత గ్రంథాలు సిద్ధమయ్యాయి. ఆ పరిశోధక విద్యార్థులలో కొందరికి ప్రాజెక్టులో ఉద్యోగ అవకాశాలు కూడ కల్పించడం జరిగింది. డా॥ కేసర్లవాణి ఈ ప్రణాళిక ద్వారా అన్నమాచార్య ప్రాజెక్టులో పరిశోధక సహాయకురాలిగా పని చేస్తున్నారు. తొలిసారిగా అన్నమాచార్య ప్రాజెక్టువారు అందచేసిన ఈ సహకారాన్ని సద్వినియోగం చేసుకొన్న వర్థిష్ణురాలు ఈమె.

'అన్నమయ్య అంతరంగంలో అలమేల్మంగ' అనే ఈ గ్రంథాన్ని ఈ ప్రాజెక్ట్ ప్రచురణగా మీకు అందచేయడానికి ఆనందిస్తున్నాము. అన్న

మయ్య పదాల్లో భాషా సాహిత్యరీతులు గురించి ఎంతో పరిశోధన జరుగవలసి ఉన్నది ఇందులో నిక్షిప్తమైవున్న అనేక అధ్యాత్మ విషయాలను కూలంకషంగా చర్చించి బహిర్గతపరచవలసిన బాధ్యతకూడ పరిశోధకుల మీద ఉన్నది. ఈ పరిశోధనా విభాగం సాగిస్తున్న నిర్మాణాత్మకమైన కృషికి సహృదయులు సముచిత ప్రోత్సాహ ప్రోద్బలాలు అందచేస్తారని ఆశిస్తున్నాము.

తిరుపతి
ఏప్రిల్ 1988.

ఎస్. లక్ష్మీనారాయణ, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

# ఉపోద్ఘాతము

— — —

'అన్నమయ్య అంతరంగంలో అలమేలుమంగ' చి॥ వాణి శ్రద్ధా భక్తులతో చేసిన చక్కని వ్యాసంగం. అలమేలుమంగా శ్రీనివాసులను కలిపి స్తుతించిన "శ్రీ వేంకటేశ్వర శతకం" అన్నమయ్యది ఐదు దశాబ్దాలక్రితం ముద్రణ భాగ్యాన్ని పొందింది. ఈ శతకాన్ని అన్నమాచార్య ప్రాజెక్ట్ ముద్రణగ స్వీకరించదలచి కొంత చర్చకూడ చేయడం జరిగింది. ఆ సందర్భంలో అవతరించిన ఆలోచనలకు ఈ పరిశోధకురాలు అక్షరాకృతిని కల్పించినది. 'అలమేలుమంగమ్మ' తత్త్వం గూర్చి లోతుగ పరిశీలించ వలసిన అవసరం ఉంది. అన్నమయ్య పాటల హృదయం, రహస్యం ఇందులో దాగి ఉంది. భావి పరిశీలకులకు, పరిశోధకులకు ఈ వ్యాసం ఉప కరిస్తుందనే మా విశ్వాసం.

'అలమేలుమంగ' గురించి నేను మూడేండ్లక్రితం చేసిన ఆకాశవాణి ప్రసంగాన్ని సముచితంగా ఇక్కడ పొందు పరుస్తున్నాను.*

అలమేలుమంగ:

చొచ్చితి తల్లి నీ మరుగు సొంపుగ నీ కరుణాకటాక్షమె
ట్లిచ్చెదొ నాకు నేడు పరమేశ్వరి ఓ అలమేలుమంగ నీ
మచ్చిక నంచు నీ తరుణి మన్నన నే నినుగంటి నీకు నా
బచ్చెన మాటలేమిటికి ప్రాతివి చూడగ వేంకటేశ్వరా!

ఎనిమిదేండ్ల వయస్సులో అన్నమయ్య తాళ్లపాక గ్రామం వదలి తిరుమల ఎక్కుతూ అలసిపోయి మోకాళ్ళ కొండవద్ద ఒక వెదురు పొద క్రింద

---

*ఆకాశవాణి హైదరాబాదువారి సౌజన్యంతో 10-3-83.

వాలిపోతాడు. కరుణాపాంగ అలమేలుమంగ ఆ బాలుని సేదతీర్చి ప్రసాదాన్నాలు తినిపించి అనుగ్రహిస్తుంది. ఆ చల్లని తల్లి చలువవల్ల అన్నమయ్య సరస సారస్వతపారీణుడౌతాడు. అమ్మ పాదాలను కలువలతో సంపెంగలతో పూజిస్తాడు. వాక్ప్రసూనాలతో గుచ్చికూర్చిన శతకమాలికతో అలంకరిస్తాడు. అలమేల్మంగ ద్రవిడ శబ్దం. దీని వ్యుత్పత్తి అలర్ మేల్ మంగ. అంటే పూవుమీది యువతి అని తాత్పర్యం. విరి మీద నిలిచిన యువతి అని తాత్పర్యం. విరిమీద నిలిచిన విరిబోణిని శార్దూల మత్తేభాలతో బాధించడమెందుకని చంపకోత్పలమాలావృత్తాలతోనే స్తుతిస్తాడు. అది ఆ బాలభక్తుని హృదయ సౌకుమార్యం. ఈ శతకంలో మరో చమత్కారం వుంది. తొలుత అల మేలుమంగనుద్దేశిస్తూ పద్యాన్ని అందుకొని చివర 'వేంకటేశ్వరా' అని సంబోధిస్తాడు. అలమేలుమంగా శ్రీనివాసులను వేరుచేయడం, విడిగ చూడడం ఆ పరమ భాగవతునికి సమ్మతం కాదు. జయదేవుడు తన అష్టపదులలో రాధా మాధవ తత్త్వాన్ని ప్రపంచిస్తే అన్నముకు తన పద్యాలలో, పదాలలో అలమేలు మంగా శ్రీనివాస తత్త్వాన్నే ప్రవచిస్తాడు.

అమ్మమ్మ ఏమమ్మ అలమేల్మంగనాంచారమ్మా
తమ్మి యింట నలరు కొమ్మా వో యమ్మా

ఆమె హరి వురముపై సొమ్ము. అరుత కట్టిన తాళి. దేవుని సంసార ఫలం. పరమాత్ముని ఆత్మభావంలో కీలుబొమ్మ. శ్రీనివాసుడు భోగించే మేడ. శ్రీపతి సరసాల సముద్రం. పతి కొంగుపైడి. విభుని కౌగిట విలసిల్లే శ్రీకళ. అన్నమయ్య దృష్టిలో రసస్పృష్టిలో అలమేలుమంగ నిత్య అనపాయని. శ్రీహరి ఉరమే కాపురము చేసుకొన్న ఉత్తమ ఇల్లాలు. అన్న మయ్య పాటల్లో తిరుచానూరులో వెలసిన పద్మావతీదేవి ప్రసక్తి కనిపించదు. తిరుచానూరు క్షేత్ర చరిత్రే విచిత్రం. అక్కడ పద్మావతీదేవి ఎప్పుడు వెలసినదో ఎందుకు వెలసినదో చరిత్ర దృష్టితో పరిశీలించవలసిన అవసరం ఎంతైనా వుంది. తిరుచానూరులో వెలసిన అలమేలుమంగమ్మతో అన్నమయ్య మనుమడు చిన్నన్న సాక్ష్యం చెప్పించి రెండు తెగల సాలెవాళ్ళ మధ్య తగవు తీర్చినట్లు తెలిపే తామ్రశాసనం వున్నది. తిరుచానూరులో పంచమినాడు పద్మావతీ దేవి పద్మసరోవరంనుండి ఆవిర్భవించిన పర్వదినంగ గొప్ప ఉత్సవం జరుగు తుంది. తిరుమల శ్రీనివాసుడు పూజా పసుపు కుంకుమలను తన దేవేరికి

అనాడు అందజేస్తాడు. నేడు ప్రసిద్ధంగ ప్రచారంలో వున్న పద్మావతీ శ్రీని వాసుల పరిణయగాథను అన్నమయ్య ఎక్కడా స్పృశించలేదు. సత్యశోధనకు సంప్రదాయాల శాస్త్రీయ పరిశీలన పరిశోధన ఎంతైనా అవసరం మరి.

అలమేలుమంగ నీ వభినవరూపము
జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మా '

అన్నమయ్య అలమేలుమంగ ఎన్నడు ఒంటరిగ తిరుమల గుడి గడప దాటి ఎరుగదు. వేంకటపతి వక్షస్థలమే ఆమెకు గుడిగోపురము. అప్పుడప్పుడు వంట యింటిలో భర్త భోజనభాజనములు చూడవలె కాబట్టి 'వాలిన రాజస ముతో వంటశాలలోననే మేలిమిఁ గూచున్నదలమేలుమంగ'. అక్కడ అలమేలు మంగ విగ్రహమున్నది. 'భోజ్యేషుమాతా' సూత్రాన్ని అక్షరాల పాటిస్తున్న 'కులధర్మపత్ని' ఆమె. అన్నమయ్యకేమాయ. 'ఇందిర వడ్డించ ఇంపు గను చిందక యిట్టే భుజించవో స్వామీ' అంటాడు. కష్టమంతా మంగమ్మదే ! వంటశాలలో తిష్ఠవేసుకొని కోరిన వంటకాలు వండివార్చి వడ్డిస్తే సతితో సారె సారెకు సరసాలాడుకొంటూ చొక్కి - చొక్కి [తెనాలి వాడన్నట్లు] ఆరగిస్తారు మనతిండిమెండయగారు. చెక్కుల చెమటకారగా, జుట్టుముడి వీడిపోగా గస పెట్టుకుంటూ అటూ ఇటూ పరుగెత్తుతూ బంగారు పళ్ళెరాలు అమర్చి భర్తకు వడ్డించి 'కూరలెలా వున్నాయో ఏమో' అని రుచులడుగుతూ వీవన విసరే తెలు గింటి ఇల్లాలే బొమ్మకడుతుంది అన్నమయ్య పాట విన్నప్పుడు. వేంకటేశ్వరునికి మామూలు నైవేద్యంకాదు మహానైవేద్యం. గంగాళాలు గంగాళాలు ప్రసా దాలు నేటికీ తిరుమల గుడిలో సాగుతూనే వుంటాయి.

తన్ను కన్నతల్లిలా లాలించి పాలించిన అలమేలుమంగను కన్నబిడ్డలా భావించి కీర్తిస్తాడు సంకీర్తనాచార్యుడు. అన్నమయ్య కన్యాదాతగా శ్రీనివాసు నికి కాళ్లుకడిగి కన్యాదానం చేస్తాడు. శకుంతలా పరిణయకర్త "వేంకటేశ్వరుడు మదీయ మాతా మహవంశ శిఖారత్నంబగు అన్నమాచార్యునకు జామాతరుండని పించుకున్నాడు" అంటాడు. శ్రీపాదరేణు మహత్మ్యకావ్యంలో ఇలా వుంది.

"శ్రీలలరంగ మంగమను శ్రీహరికెన్నడు ధారవోయుచో
తాళులపాక అన్నమయ తా కడిగెం బదముల్ ధరిత్రి"

తిరుమల ఆలయంలో ఈ కల్యాణోత్సవాన్ని తాళ్లపాక అన్నమయ్య తొలుత ప్రవేశపెట్టినట్లున్నది. నేటికి తాళ్లపాక వంశస్థులకు కల్యాణోత్సవంలో ప్రత్యేక మిరాశీ వున్నది.

"విచ్చేయవమ్మా వెన్నెలబొమ్మ
మచ్చిక మరుని ధాక మగువ నీ రాక"

అని అప్పుడే యౌవనప్రాంగణంలో అడుగుపెడుతున్న కన్నబిడ్డ మంగమ్మను అక్కున చేర్చుకొని మూర్ధాఘ్రాణం చేస్తాడు అన్నమయ్య. ఈ మరుని కొమ్మను మదనగురుడు వలచినాడు. కల్యాణఘడియలు సమీపించాయి. "ఇదె పెండ్లి లగ్నవేళ ఇంతికి నీకు" అని అన్నమయ్యే లగ్నం పెడతాడు. పేరటాండ్ల చేత పసిడి అక్షతలు పెట్టించి అలమేలుమంగా శ్రీనివాసుల కళ్యాణానికి ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తాడు. క్రొత్త పెళ్ళికూతురు పల్లకిలో కళ్యాణ వేదికకు తరలింది. తన బంగారు తల్లి కూర్చున్న పల్లకిని బిరుసు బోయీలు మోయడం ఇష్టంలేక శ్రీపాదాలను తాకే అధికారంగల స్త్రీలను వినియోగిస్తాడు. ఆ మగువల నడకల కులుకులకు తన తనయ కందిపోతుందని నవవధూశృంగారాలు చెదిరి పోతాయని తత్తరపడుతూ 'కులుకక నడవరో కొమ్మలాల! జలజల రాలీని జాజులు మా యమ్మకు' అని మందలిస్తాడు. కర్పూర ఆరతుల వీగ సోకోర్వని తన చిట్టితల్లికి ముత్తైదువలతో మణుల ఆరతులు ఇప్పిస్తాడు. భారతీ గిరిజలతో పెండ్లిపాటలు పాడించి రంభాది అప్సరసలతో నాట్యాలు ఏర్పాటు చేయిస్తాడు. పుణ్యసతులు దేవికిదేవునికి తలంబ్రాలు పోశారు. పెళ్లితంతు ముగిసింది. కన్యాదాత కళ్ల ఆనందంతో చెమర్చాయి.

"అమరించీ కౌగిట అలమేలుమంగనిదె
సమకూడె వేంకటేశ్వరుడు మా యమ్మకు"

అని అన్నమయ్య ఆనందంతో నిట్టూర్చాడు. నూత్న దంపతులకు శోభనం ఏర్పాట్లు - పసిడిమేడలో ముత్యాలమంచం అమర్పించాడు. తన పలుకు తేనెల తల్లి తిరువేంకటాచలాధిపుని కౌగిట కలసిపోయినదని తన బిడ్డ ప్రణయ సౌభాగ్యం ఫలించిందని పులకించి పోయాడు. వేంకటరాయని పట్టపురాణి అయి

పట్టి మాకులిగిరించు పలపు మాటలతో విభుని బట్టిగొన్నది మా యమ్మ" అని మురిసిపోయాడు. ఆ క్షీరాబ్ధి కన్యకను వేంకటపతి వక్షస్థ్యలతో తిలకించిన అన్నముని మనసు పాలసముద్రమే అయింది.

"ఆపె నీకు తగు నీవు ఆపెకే తగుదువయ్యా
చేపట్టి మీ యిద్దరికి చెప్పరాదు మోహము
తామెర రేకులవంటి తగు నీ కన్నులనుచు
తామెరలే చేతపట్టె తరుణి
కామించి పాలజలధికడ పవ్వళింతువని
కోమలి పాలజలధి కూతురాయ నిదివో
కొండపై శ్రీవేంకటేశ కోరి నీవెక్కితివని
కొండవంటి నీ వురము కొమ్మయెక్కెను
అండ అలమేలుమంగ ఆపె నీకు కలుగగా
అండ నీ దాసులకు నీ వాపెయు కలగితిరి

అలమేలుమంగను శ్రీనివాసుడుగాని, శ్రీనివాసుని అలమేలుమంగకాని విడనాడి మనలేరు. మంగలేని శ్రీనివాసునికి శోభలేదు. శ్రీనివాసుడులేని మంగకు విభవమే లేదు. తిరుమల శ్రీనివాసునికి శుక్రవారమే అభిషేకం. కారణం అలమేలుమంగ వక్షస్థలంలో ఉండడం వల్లనే.

'కంటి శుక్రవారము గడియలేడింట
అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని'

ఆ అన్నమయ్యతోపాటు మనం కూడ చూడగలిగింది అలమేలుమంగా శ్రీనివాసులనే.

ఈ తత్త్వం గురించి డాక్టర్ వేటూరి ఆనందమూర్తిగారన్న మాటలతో నా ప్రసంగాన్ని కట్టిపెడతాను.

ఆ దివ్యదంపతుల లీలావిలాసమే ప్రకృతియందలి చైతన్యము. వారి యిరువురి సంయోగము జీవపరమాత్మల సంయోగము వంటిది. వారిలో

వారికి ఒకరివలన ఒకరికి విఖ్యాతి. ఇరువురుగా వారి వైశిష్ట్యమును వెల్లడించు కొనుచునే దైహికముగను ఆత్మికముగను కూడ విశిష్టమగు నేకత్వానుభూతిని వారు పొందుచుండుదురు.

"ఆతఁడేనీవు, నీవనఁగ నాతఁడె నీ పలుకే తలంపగా
నాతని పల్కు నీ హృదయ మాతడె పో యలమేలుమంగ, నీ
చేతిదె సర్వజంతువుల జీవనమంతయు నంచు సన్ముని
వ్రాతము సన్నుతించు ననివారణ నీ సతి వేంకటేశ్వరా".

అన్నమాచార్యుల వాఙ్మయంలో త్రవ్వితీయదగిన విజ్ఞాన నిధులెన్నో ఉన్నాయి. ఇప్పుడు భిన్న విభిన్న విశ్వవిద్యాలయాలలో తాళ్ళపాక కవుల సారస్వత సేవను గుర్తించి పరిశోధకులను ప్రోత్సహిస్తున్నది. ఈ సన్నివేశంలో శ్రీ వేంక టేశ్వర విశ్వవిద్యాలయం అన్నమాచార్య పీఠం తాళ్ళపాక వాఙ్మయంలో చేస్తున్న గణనీయమైన కృషి ప్రశంసనీయము. ఎంత చేస్తున్నా నా మటుకు నాకు ఈ వాఙ్మయంలో జరిగినది కొంతే జరుగవలసినది ఎంతో ఉన్నదనిపిస్తుంది క్రింద మీద శక్తులు ఏకమైనప్పుడు సాధ్యము కానిదేమున్నది.

మా ప్రాజెక్టు కార్యకలాపాలను శ్రద్ధతో పరిశీలిస్తూ మాకు అధికారికమైన ప్రోత్సాహాన్నిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి, శ్రీ కార్య నిర్వాహకులగు శ్రీ ఎస్. లక్ష్మీనారాయణగారికి, దేవస్థానం భద్రత మరియు నిఘా అధికారి శ్రీ కె. కృష్ణమూర్తిగారికి మా కృతజ్ఞతలు. అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రచురణల విషయంలో ఎంతో శ్రద్ధను అభివ్యక్తం చేస్తున్న దేవస్థానం ప్రచురణ విభాగానికి, ముఖపత్రాన్ని అందంగా చిత్రించిన ఆస్థాన చిత్రకారులు శ్రీబాపూగారికి, ఈ గ్రంథాన్ని చక్కఁగా అచ్చొత్తించిన దేవస్థానం ముద్రణా లయంవారికి మా హార్దమైన ధన్యవాదాలు.

యీ రీతి శ్రీ వేంకటేశ నిన్నుఁగూడె నేఁడు
అరితేరె నన్నిటాను అలమేలుమంగ.

— అన్నమయ్య

కామిశెట్టి శ్రీనివాసులు.

తిరుపతి

ప్రొఫెసర్ జి. ఎన్. రెడ్డి,
ఎమ్.ఏ., ఎమ్.లిట్., పి.హెచ్‌డి.,
ఉపాధ్యక్షులు,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

## ఈ పుస్తకం ఒక పుష్పం

అన్నమయ్య సంకీర్తనలు భారతీయ భాషా సాహిత్యాలలో సాటిలేని రచనలు. ఉపమించి చెప్పాలంటే అన్నమయ్య సంకీర్తన వాఙ్మయం ఒక అద్భుతమైన సంగీత సాహిత్య సముద్రం.

అన్నమయ్య సంకీర్తనల ప్రచురణకు, ప్రచారానికి తిరుమల తిరుపతి దేవస్థానం చేస్తున్న కృషి ప్రశంసనీయం. అయినా అన్నమయ్య వాఙ్మయరంగంలో ఇంతవరకు జరిగిన పరిశోధన బెత్తెడు మాత్రమే!

ఒక్క దేవస్థానమేకాకుండా విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వం, ఇతర సంస్థలుకూడా అన్నమయ్యను దత్తుగా స్వీకరిస్తేతప్ప అన్నమయ్య సంగీత సాహిత్యసంపద జగద్విత్తంబుకాదు, జగద్ధితంబుకాదు.

అన్నమయ్య రచిరిచిన సంకీర్తనలు 32 వేలు. మనకు లభించినవి అందులో ఐదింట రెండు భాగాలు మాత్రమే. ఆ మాత్రమైనా లభ్యంకావడం మన దురదృష్టంలో అదృష్టం అనుకోవాలి. అయినా అన్నమయ్య సంకీర్తన వాఙ్మయంమీద సంగీత సాహిత్యవేత్తలు, భాషాసామాజిక చరిత్రకారులు సమగ్రంగా పరిశోధనలు జరిపితే ఆవిమర్శ వాఙ్మయం 32 వేలపుటలకు తగ్గదు. అన్నమయ్య వాణి మహిమాన్వితమైనది. అందుకు పరిశోధకులు, సరస్వతీ పుత్రులు అనేకులు అంకితం కావాలి.

అద్భుతమైన అన్నమయ్య వాటిని అభిమాన విషయంగా స్వీకరించి డాక్టరేట్ పట్టాన్ని పొందిన పరిశోధకురాలు డా॥ కుమారి కె. వాణి. 'అన్నమయ్య అలంకారాల' మీద ఉత్తమ సిద్ధాంత వ్యాసాన్ని రచించడమేకాకుండా మంచి వ్యాసాల్నికూడా ప్రచురించిన విదుషి.

అన్నమయ్య సంకీర్తనల్లో అలమేలుమంగను ఒక నాయికగా చేసుకొని ఆ నాయికయొక్క మానసిక ప్రవృత్తిని వైవిధ్య భరితంగా కీర్తించిన కీర్తనలు కొన్ని ఉన్నాయి. అలాంటి సంకీర్తనల్ని ఆధారంగా గ్రహించి 'అన్నమయ్య అంతరంగంలో అలమేల్మంగ' అను పేర ఈ చిన్న పుస్తకాన్ని డా॥ కుమారి వాణి రచించి ప్రచురించడం ముదావహం. అందుకు కుమారి వాణిని అభినందిస్తున్నాను. ఆలంకారిక సామాజిక విశేషాలనుకూడా రచయిత్రి ఈ రచనలో ప్రస్తావించడం ప్రశంసనీయం. తగిన ప్రోత్సాహాన్ని అవకాశాన్ని అందించినట్లయితే అన్నమయ్య వాటిని ప్రామాణిక రచనలద్వారా లోకవిదితం చేయగల శక్తి, చొరవ, శ్రద్ధగల రచయిత్రి కుమారివాణి. అన్నమయ్య సాహిత్యారాధనలో ఈ పుస్తకమొక సుగంధ పుష్పం.

5—5—1985. జి. ఎన్. రెడ్డి,

డా॥ కె. సర్వోత్తమరావు,
రీడర్;
అన్నమాచార్య పీఠం,
తెలుగు అధ్యయన శాఖ,
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

తిరుపతి,
4-5-'85.

## అభిప్రాయం

తిరుమల తిరుపతి దేవస్థానంవారి అవిరామకృషి ఫలితంగా అన్నమయ్య సంకీర్తనల ప్రచారం జోరుగా సాగుతోంది. అలాగే అన్నమయ్య సాహిత్య ప్రచారంకోసం దేవస్థానంవారు సంకీర్తనల సంపుటాన్ని ప్రచురిస్తున్నారు. ఇప్పుడిప్పుడే విశ్వవిద్యాలయాలలో ఈ సాహిత్య పరిశోధనపట్ల అభిరుచి, ఆసక్తి పెరుగుతున్నది. ఈ పరిశోధన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖలో మూడు పువ్వులు ఆరు కాయలుగా పెరుగుతోంది. ఈ పరిశోధన రెండు రకాలుగా ఉంది. మొదటిది ఎం.ఫిల్; పిహెచ్.డి.: పట్టాలకోసం సిద్ధాంత వ్యాసాలు సమర్పించడం, రెండవది అడపాదడపా తాళ్లపాక అన్నమయ్య గురించి పుస్తకాలు, వ్యాసాలు ప్రచురించడం.

'అన్నమయ్య అంతరంగంలో అలమేల్మంగ' అనే పుస్తకము వ్రాయడానికి తగిన అధికారం డా॥ కేసర్ల వాణికి వున్నది. ఎం.ఏ. లో ఐచ్ఛిక పాఠ్యాంశంగా అన్నమయ్య కీర్తనలు చదవడం, పిహెచ్.డి. కోసం 'అన్నమయ్య పదకవితల్లో అలంకారాల పరిశీలన, అనే అంశం ఎన్నుకొని పట్టా పుచ్చుకోవడం, పట్టాపుచ్చుకొన్న తర్వాత సాహిత్య పరిశోధనకు స్వస్తి చెప్పకుండా మరింత

క్షుణ్ణంగా పరిశీలన చేయాలనే సంకల్పం ఉండడమే ఆ అధికారాలు. ఈ ప్రయత్నంలో డా॥ కేసర్ల వాణి కృతకృత్యులయ్యారని నా నమ్మకం.

అన్నమయ్య కాలంనాటి అలమేలుమంగ ఆలయ అస్తిత్వం గురించి రచయిత్రి తెలియజేసిన అంశాలు వారి చారిత్రక దృష్టికి, అలమేలుమంగపైని అనేక నాయికా వర్ణన సంకీర్తనలను సమన్వయించి చూపడంలో రచయిత్రికివున్న అలంకారశాస్త్ర పరిచయం స్పష్టమవుతుంది. విషయసేకరణలో నిండుతనం, వివరణలో స్పష్టత ఈ పుస్తకంలోని ప్రత్యేకాంశాలు.

అన్నమాచార్య ప్రాజెక్టువారు ఈలాంటి పుస్తకాల్ని తరచు ప్రచురిస్తూ యువ పరిశోధకుల్ని ప్రోత్సహించడం సమంజసంగా ఉంది.

— కె. సర్వోత్తమరావు.

# కృతజ్ఞతాంజలి

అన్నమయ్య సాహిత్యంపై డాక్టరేట్ పట్టా పొందడానికి ఆర్థికసహాయం అందించి, డాక్టరేట్ పొందిన అనంతరం రీసెర్చి అసిస్టెంటుగా అన్నమాచార్య ప్రాజెక్టునందే ఉద్యోగావకాశం కల్పించి 1978 నుండి నేటివరకు అన్నమయ్య సాహిత్య పరిశోధ నకు ఇతోధికమైన ప్రోత్సాహాన్ని అందిస్తున్న తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యానికి;

అన్నమయ్య 'వేంకటేశ్వర శతక' పరిశీలన సందర్భంగా వెలువరించిన ఈ రచనకు ముద్రణ భాగ్యాన్ని కలిగించి, ముందు మాటను పొందుపరచిన తిరుమల తిరుపతి దేవస్థాన శ్రీ కార్య నిర్వాహకులు శ్రీ ఎస్. లక్ష్మీనారాయణగారికి;

ఈ రచన వెలుగు చూడడానికి కృషి సల్పిన తిరుమల తిరు పతి దేవస్థానం భద్రత మరియు నిఘా అధికారి శ్రీ కె. కృష్ణమూర్తి గారికి, పౌరసంబంధాధికారి శ్రీ రావుల సూర్యనారాయణగారికి;

అన్నమాచార్య సాహిత్యంపై డాక్టరేట్ పట్టా పొందడానికి అవకాశం కల్పించి, ఈ రచనపై తమ అమూల్యాభిప్రాయాన్ని తెలిపిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి. ఎన్. రెడ్డిగారికి;

అన్నమయ్య సాహిత్యంలోని ఎన్నో విశాషాంశాల్ని తెలుపుతూ, పరిశోధనలో నాకు కలిగే సందేహాల్ని శిష్య వాత్స ల్యంతో నివృత్తి చేస్తూ సూచనలందిస్తున్న అన్నమాచార్య వాఙ్మయ స్పెషలాఫీసరు (రిటైర్డ్) శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారికి;

'అన్నమయ్య పదకవితల్లో అలంకారాలు' అనే అంశంపై నేను డాక్టరేట్ పట్టా పొందడానికి కృషిచేసిన నాటినుండి ఈ సాహిత్య పరిశోధనలో నిరంతరం నిర్మాణాత్మకమైన విశేషాంశాల్ని తెలుపుతూ ప్రోత్సహించడమేకాకుండా, ఈ రచనరూపు దిద్దుకోవడానికి కారకులైన ఎస్. వి. యూనివర్సిటీ అన్నమాచార్య పీఠం — రీడర్ డా॥ కె. సర్వోత్తమరావుగారికి;

ఎమ్.ఏ.లో అన్నమాచార్య సాహిత్యాన్ని ఐచ్ఛిక పాఠ్యాంశంగా ఎన్నుకొన్నప్పటి నుండి సాహిత్య పరిశోధనలో నేటివరకు తమ సహాయ సహకారాలందిస్తున్న అన్నమాచార్య ప్రాజెక్ట్-ఆఫీసర్-ఇన్-ఛార్జ్ శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుగారికి;

ఈ పుస్తకం సకాలంలో ముద్రింపబడుటకు సహకరించిన ప్రెస్ మేనేజర్ శ్రీ విజయకుమార్‌రెడ్డిగారికి, సాంకేతిక సిబ్బందికీ నా హార్దమైన ధన్యవాదములు.

కేసర్ల వాణి,
రీసెర్చ్ అసిస్టెంట్,
అన్నమాచార్య ప్రాజెక్టు.

# అన్నమయ్య అంతరంగంలో అలమేల్మంగ

భారతీయ సాహిత్య వికాసానికి మతమే భూమిక. మతాన్ని ఆశ్ర యించిన సాహిత్య ప్రక్రియల్లో సంకీర్తనశాఖ గణనీయమైంది. ఆంధ్రవాగ్గేయ కారుల్లో అగ్రగణ్యుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. క్రీ. శ. 15వ శతాబ్దంలో వైష్ణవమత ప్రచారోద్దేశంతో వేంకటేశ్వరాంకితంగా 32 వేల సంకీర్తనల్ని, 12 శతకాల్ని, ద్విపదరామాయణం, శృంగారమంజరి, సంస్కృతంలో వేంకటాచల మహాత్మ్యం, సంకీర్తన లక్షణ గ్రంథాన్ని రచించిన మహాభక్తుడు. ఇతని రచనల్లో మనకు దొరికినవి దాదాపు 14 వేల పదాలు, శృంగారమంజరి, శ్రీవేంక టేశ్వరశతకం మాత్రమే. అన్నమయ్య సంకీర్తనలు ప్రధానంగా రెండురకాలు. 1. అధ్యాత్మ సంకీర్తనలు, 2. శృంగార సంకీర్తనలు. అధ్యాత్మ సంకీర్తనల్లో స్తుతి, ప్రపత్తి, దేహాత్మైక విచారాదులు గోచరిస్తాయి. శృంగార సంకీర్తనల్లో అమలిన దివ్య శృంగారపద్ధతిలో జీవాత్మ పరమాత్మల తదైక్యాన్ని చాటే మధురభక్తికి ప్రాధాన్యం ఇవ్వబడింది.

వైష్ణవంలో అనంత కళ్యాణ గుణోపేతుడైన శ్రీ మహావిష్ణువుకు పరం దేవి (పేరుందేవి) యైన శ్రీదేవికి విశిష్టమైన సమ ప్రాధాన్యం ఉంది. అన్నమయ్య సాహిత్యంలో 'జగదేకవిభునిరాణి'గా కీర్తించబడ్డ అలమేల్మంగ లక్ష్మీస్వరూపిణి. అలమేల్మంగను వేంకటవిభుని వక్షఃస్థలవాసినిగా, లోకమాతగా, శృంగారరసాధి దేవతగా కీర్తించి తరించాడు అన్నమయ్య.

అన్నమయ్య తొలిరచన శ్రీ వేంకటేశ్వర శతకమనే చెప్పవచ్చు. ఒక్కొక్క సమయంలో ఆశువుగా అలవోకగా వీరు చెప్పిన శతకాలు మరో పది కొండింటిని మనుమడు చిన్నన్న 'అన్నమయ్య చరిత్రలో' పేర్కొంటాడు. 'వేంకటేశ్వరశతకం' అని పేరైనా ఈశతకంలో 'అలమేలుమంగా శ్రీనివాసులను' కలిపే కథ నడిపాడు. సంబుద్ధిలో 'వేంకటేశ్వరుడు'న్నా తాళ్ళపాక ఘనుడు శతకమాలికను సమర్పించింది 'అమ్మకే':

'అమ్మకుఁదాళ్లపాక ఘనుఁడన్నఁడు పద్యశతంబు సెప్పెఁగో
కొమ్మని వాక్ప్రసూనములఁ గూరిమితో నలమేలుమంగకున్

నెమ్మది నీవు చేకొని యనేక యుగంబులు బ్రహ్మకల్పముల్
సమ్మదమంది వర్ధిలను జవ్వన లీలల వేంకటేశ్వరా!

[శ్రీ వెంకటేశ్వరశతకం-100 ప]

అలమేల్మంగ అన్నపదం 'అలర్‌మేల్‌మంగై' అనే ద్రవిడ పదానికి తెలుగు రూపాంతరం.

అలర్-పువ్వు, మేల్-మీదవున్న, మంగై-మగువ (పదారేండ్ల యావనవతి) అని అర్థం. ఆమే పద్మాసని. అలమేల్మంగ లక్ష్మీస్వరూపిణి అనే దీని భావం.

పద్మనాభప్రియమైన శ్రీదేవి ధ్యేయాస్వరూపం పద్మాలయా, పద్మాసనా, పద్మనయనా, పద్మప్రియా, పద్మహస్తా, పద్మపాదా, పద్మవర్ణా, పద్మమాలాధరా, పద్మప్రభా, పద్మగంధినీ, పద్మసుందరీ అని పురాణాల్లో సంహితల్లో చెప్పబడింది.

కలియుగ ధర్మాల్ని సవిస్తరంగా వివరించే పురాణం భవిష్యత్పురాణం. ఇందులో వైకుంఠవాసుడగు విష్ణువు వేంకటాచలస్థుడు కావడానికి కారణం, పద్మావతీ పరిణయాది వృత్తాంతాలు చెప్పబడ్డాయి.

పద్మపురాణంలో అలమేల్మంగ జననం, పద్మసరోవర మాహాత్మ్యం పేర్కొనబడింది.

బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల్లో యజ్ఞపురుషుడు ఎవ్వరనే సందేహ నివృత్తికోసం ఋషులు భృగువును నియమిస్తారు. సత్య, కైలాస లోకాల్లో బ్రహ్మ, శివుల్ని పరీక్షించి వారి రజస్తమో గుణాధిక్యానికి భృగువు ఉగ్రుడై వారిని శపించి వైకుంఠానికి పయనమవుతాడు. అక్కడ లక్ష్మీదేవితో కేళీవినోదయుక్తుడైయున్న విష్ణువునుచూచి భృగువు ఆగ్రహంతో అతని వక్షఃస్థలాన్ని తంతాడు. ఈ చర్యకు విష్ణువు భృగువును శిక్షింపక మన్నించి సత్కరించాడని రోషంతో వక్షఃస్థలవాసినియైన లక్ష్మి సహించక అలిగి భూలోకానికి వెళ్తుంది. అనపాయినియైన లక్ష్మిని ఎడబాసిన మహావిష్ణువు వైకుంఠాన్ని వీడి కొల్హాపురంలో అగస్త్యమహర్షిచే అర్చింపబడుతున్న లక్ష్మిని అక్కడి మునులతో చేరి పది సంవత్సరాలు అర్చిస్తాడు. అంత అశరీరవాణి ఆదేశానుసారం సువర్ణముఖీ నదీ తీరంలో శుకపురాన సరోవరాన్ని నిర్మించి దేవలోకంనుండి సువర్ణ కమలాల్ని

తెప్పించి నాటిస్తాడు. అవి సదా వికసించి ఉండేందుకుగాను శ్రీసూర్యనారాయణ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పన్నెందు సంవత్సరాలు తపస్సుచేస్తాడు. అంత ప్రణయ కలహాన్ని వదులుకొని లక్ష్మీదేవి కార్తీకమాస శుక్లపక్షపంచమీ తిథి శుక్రవారం ఉత్తరాషాఢ నక్షత్ర శుభదినాన స్వర్ణకాంతితో స్వర్ణకమలంతో పద్మాసనియై శ్రీ మహావిష్ణువుకు సాక్షాత్కరించి కల్హార మాలను శ్రీస్వామివారి కంఠాన వేసి వక్షః పీఠాన్ని అలంకరిస్తుంది. అంత విష్ణుమూర్తి శుకపుర సరోవరానికి, అచ్చట తపస్సుచేసి లక్ష్మీదేవిని పొందినందువల్ల, పద్మసరోవరమని పేరిడి అత్యున్నత సరోవరంగా ప్రభాసించునట్లు ఆశీర్వదిస్తాడు. ఇది పద్మపురాణగాథ.

నేటికీ తిరుచానూరులో 'పంచమీతీర్థం' పేరుతో పాంచరాత్ర ఆగమ విధానంలో కార్తీక శుక్లపక్ష పంచమీ తిథిన అమ్మవారికి అవభృథోత్సవం జరుగుతున్నది.

ఎన్నో పురాణకథల్ని, సన్నివేశాల్ని కీర్తనలుగా వ్రాసిన అన్నమయ్య పద్మావతిగా [అలమేల్మంగ] జన్మించిన లక్ష్మీదేవి వృత్తాంతాన్ని కాని, పద్మావతీ శ్రీనివాసుల పరిణయగాథను కాని సంకీర్తన రాశిలో ఎక్కడా ప్రస్తావించక పోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంట.

అలమేల్మంగ తిరుచానూరులో నెలకొన్నట్లు అన్నమయ్య పదాల్లో ఎక్కడా ప్రస్తావనలేదు. వీరి పాటల్లో అలమేల్మంగ వేంకటవల్లభుని వక్షఃస్థల వాసినియే. సామాన్యంగా శైవంలో ప్రత్యేక శక్తి ఆలయాలున్నాయి. ప్రత్యేక ఆరాధనవుంది. కాని వైష్ణవంలో ప్రత్యేకమైన లక్ష్మీదేవాలయాలు తక్కువ. మహారాష్ట్రలోని కొల్హాపూర్ లక్ష్మీదేవాలయం, తిరుచానూరు పద్మావతీ అమ్మవారి ఆలయాలు ఈ కోవకు చెందినవి.

అలమేలుమంగమ్మ వెలిసిన చోట్లు–తిరుమల వేంకటేశ్వరుని గుడికి ప్రక్కన వంటశాలలో వకుళమాలికతో వెలసిన అలమేలుమంగ;

తిరుపతికి సమీపంలో తిరుచానూరులో పద్మసరోవర తటంలో వెలసిన పద్మావతి;

చంద్రగిరి సమీపంలోని శ్రీనివాస మంగాపురాన్నే పూర్వం అలమేలు మంగాపురం, అని పిలవడం మొదలైనవి.

తిరుమల వంటశాలలోని వకుళమ్మ మందిరంపైన వున్న విగ్రహం అలమేల్మంగమ్మేనని చారిత్రక విమర్శకుల అభిప్రాయం. ఈ అభిప్రాయానికి ఆధారంగా అన్నమాచార్యుని

వాలిన రాజసముతో వంటసాలలోనే
మేలిమిఁగూచున్న దలమేలుమంగ–అనేకీర్తన [21-376]

అదె వంటశాలలోన అలమేలుమంగ నాంచా
రెదుట శ్రీవేంకటేశునకిత వైన యట్లు ॥

అఁదెలు గల్లురనఁగా నడుగులు పెట్టిపెట్టి
విందులలమేలుమంగ వేళవేళను
చెంది శ్రీవేంకటపతికి చేతులకుఁగడిగడి
అంది యిచ్చి పొత్తునఁ దానారగించీ నదివో ॥ [23-316]

కలకల నవ్వుతోడ కలికి చూపుతోడ
అలబలము చేసీ నలమేలుమంగ

బోనమింటిలోన నుండి పొద్దు వొద్దు హరికిని
సేసగా వింత చవులు సేయించి
తానే వడ్డించేనంటా తనఁగీలుగంటుతోడ
ఆనివట్టి కాచుకున్న దలమేలుమంగ ॥ [23-381]

అనే పెదతిరుమలాచార్యుని కీర్తనలు వంటఇంటిలో అలమేల్మంగ వున్నట్లు స్పష్టీకరిస్తున్నాయి.

పైగా చిన్నన్న 'అన్నమాచార్య చరిత్ర'లోని

శ్రీనివాసుని నమస్కృతి చేసి దండఁ
గానుపించిన భాష్యకారులఁబొగడి
శ్రీనరసింహు సేవ గావించి
దానవాంతకు జనార్దను సన్నుతించి
అలమేలుమంగకు నభివందనములు
సలిపి చెంగటి యాగశాలఁగీర్తించి [అ. చ. పుట-21]

అనే ద్విపద పంక్తులలో జనార్దనుని స్తుతించి, అలమేల్మంగకు అభివందనములు సలిపి పిమ్మట స్వామివారిని సందర్శించినట్లు వర్ణింపబడింది.

నేటికీ తిరుమలలో వకుళమాలిక విగ్రహమున్న మందిరం పైన 'మంగమ్మ' విగ్రహాన్ని చూడవచ్చు.

తిరుచానూరుకు పూర్వం శుకమహర్షి నివసించినందువల్ల 'తిరుశుకనూరు 'శ్రీశుకనూరు' అనే వ్యవహారం వుండేది. దీనికి 'చిరుతానూరు' అనే వ్యవహారమూ లేకపోలేదు. తమిళ ప్రభావంచే నేడు 'అలమేల్మంగాపురం'గా స్థిరపడి పోయింది. తిరుచానూరు ఆలయ ప్రాంగణంలో కృష్ణాలయం, సుందరరాజ ఆలయాలు కూడా వున్నాయి. వీటిలో ప్రాచీనకట్టడం కృష్ణాలయం. అమ్మవారి ఆలయం ముఖద్వారానికి ప్రక్కగా వుండడం గమనించదగ్గది.

తిరుపతి గ్రామదేవత [ప్రస్తుతం అంకాలమ్మ గుడి] ఆలయంలోవి తిరుప తమ్మ పద్మావతియై తిరుచానూరు చేరినట్లుగా జనవ్యవహారం.

మొదట శ్రీనివాస మంగాపురాన్నే అలమేల్మంగాపురంగా పిలిచేవారట. పద్మశాలీల వివాదం తీర్చి పద్మావతీదేవి నాటి అలమేల్మంగాపురం నుండి అదృశ్యమవడంతో మంగాపురమై తర్వాత శ్రీనివాసమంగాపురంగా స్థిరపడి పోయిందనే అభిప్రాయం కలదు.

ఉత్సవాలలో, ఊరేగింపులలో అలమేలుమంగను విశేషంగా వర్ణిస్తాడు సంకీర్తనాచార్యుడు.

"ఉత్సూతే సుఖమితి ఉత్సవః"—ఆనందాన్ని అధికంగా కలిగించేదని ఉత్సవాలకు అర్ధం. ఈ ఉత్సవాలు రెండు రకాలు. మూల విగ్రహానికి జరిగేవి, ఉత్సవ విగ్రహానికి జరిగేవి. నిత్యవ్యవహారంలో ఉత్సవ విగ్రహాలకు జరిగేవే ఉత్సవాలుగా రూఢి పొందాయి. అన్నమయ్య పదాల్లో అమ్మవారి బ్రహ్మోత్సవాల ప్రసక్తి కన్పట్టదుకాని శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అమ్మవారికి ప్రాధాన్య మివ్వబడింది.

తిరువీథుల మెరసీ దేవదేవుఁడు
గరిమల మించిన సింగారములతోడను [13-192]

అనే బ్రహ్మోత్సవ వర్ణన సంకీర్తనలో వేంకటేశ్వరునికి జరిగే శేష వాహనం, ముత్యాల పందిరి, కల్పవృక్షం, గరుడ, గజ వాహనాలు, సూర్య ప్రభ, రథోత్సవం, పల్లకి వాహనం, కళ్యాణోత్సవాల్ని క్రమంగా వర్ణించాడు.

ఈ బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం, కళ్యాణోత్సవాల్లో మాత్రమే అలమేల్మంగ ప్రస్తావన వున్నట్లు సంకీర్తనల పరిశీలనవల్ల స్పష్టమవుతోంది.

అమరాంగనలదె యాడేరు
ప్రమదంబున నదె పాడేరు ॥
అలమేల్మంగతో నటు శ్రీవేంకట
నిలయుఁడరదమున నెగడీని ॥ [10-26]

అని అలమేల్మంగ వేంకటేశ్వరుల రథోత్సవాన్ని వర్ణించాడు.

తిరుమలలో జరిగే కళ్యాణోత్సవ నిర్వహణకు ఆద్యుడు అన్నమయ్యేనని తిరుమల శాసన పరిశీలకుల అభిప్రాయం.

అలమేల్మంగ తాళ్ళపాక వారింటి ఆడపడుచు. అన్నమయ్య కన్యాదాతయై అలమేల్మంగకు శ్రీహరికి కళ్యాణోత్సవం చేయించినట్లు అతని దౌహిత్రుడు రేవణూరి వేంకటాచార్యుడే—

శ్రీలలరంగ మంగమను శ్రీహరి కెన్నఁడు ధారవోయుచోఁ

దాళులపాక యన్నమయ దాఁగడిగెం బదముల్ '

అని శ్రీపాద రేణు మహత్మ్యంలోను,

'అమ్మహాదేవుండు మదీయ మాతామహవంశ శిఖారత్నంబగు నన్నమాచార్యునకు జామాతురుండనిసించుకొని, అని శకుంతలాపరిణయం కృత్యవతరణికలోను పేర్కొన్నాడు.

గరుడధ్వజంబెక్కె కమలాక్షు పెండ్లికి
పరుషలదివో వచ్చెఁబై పై సేవించను ॥

కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవెంకటాద్రి
వేడుకలు మీరఁగ శ్రీవిభుని పెండ్లికిని ॥

ఆసల శ్రీవెంకటేశుఁడలమేలుమంగఁదాను
సేసలు వెట్టినయట్టి సింగారపు పెండ్లికి ॥ [8-21]

అని శ్రీవెంకటాద్రిలో దేవతాగణ సమక్షంలో జరిగే దివ్యదంపతుల కల్యాణోత్సవ వైభవాన్ని కీర్తించాడు.

ఇవే కాకుండా పుష్పయాగం, తెప్పోత్సవం, వసంతోత్సవం, ఉట్ల వుత్సవాల పాటల్లోను 'అలమేలుమంగ' వర్ణనలు కన్పిస్తాయి.

పుష్పయాగం అలయ సంప్రదాయాలలో స్థిరమైన మరో గొప్ప ఉత్సవం.

పూవుఁబోఁణుల కొలువే పుష్పయాగము
పూవక పూచె నీకిట్టె పుష్పయాగము ॥

యీటున శ్రీవేంకటేశ యిట్టె యలమేలుమంగ
హూఁట పూఁట రతులివి పుష్పయాగము ॥ [13-60]

అనే సంకీర్తనలో దివ్యదంపతుల శృంగారవర్ణన కన్పిస్తుంది. క్రీ.శ. 1980లో తిరుమల తిరుపతి దేవస్థానంవారు పుష్పయాగమహోత్సవాన్ని పునః ప్రారంభించారు.

తిరుమల స్వామి పుష్కరిణి జలం సర్వపాపహరమైంది. సర్వ పుణ్య ఫలప్రదమైన ఈ ఉత్సవం ప్రతిసంవత్సరం ఫాల్గుణ ఏకాదశి నుండి పూర్ణిమ వరకు జరుగుతుంది.

దెవునికి దెవికిని తెప్పలకోనేటమ్మ
వేవేలు మొక్కులు లోకపావని నీకమ్మ [17-192]

అని తెప్పోత్సవాన్ని వర్ణించాడు.

వసంత ఋతువు చైత్రమాసం శుద్ధ త్రయోదశి, చతుర్దశి, పూర్ణిమ మూడు రోజులు ఉత్సవమూర్తి శ్రీమలయప్పస్వామికి శ్రీ భూదేవులకు వసంతోత్సవం జరుగుతుంది. దీన్ని అన్నమయ్య నిత్యోత్సవంగా కూడ పేర్కొంటాడు.

వనితకుఁ బతికిదె వసంతము
దినదినము నమరె తిరుమలమీఁద ॥

పుప్పొడి వసంతము పొసఁగె రమణునికి
కప్పుర వసంతము కాంతకును
కొప్పెరల నెదురుగఁ గుంకుమ పన్నీరునించి
కుప్పెలఁ జల్లులాడేరు కోనేటికాడ ॥

జవ్వాది వసంతము చతురుఁడు గై కొనె
పువ్వుల వసంతము పొలఁతికిదె
రవ్వగా బండ్లపై రాసులు వోసుక
నవ్వుతా వేటులాడేరు నడిమి చింతాడ ॥

గందపు వసంతముఁ గడు శ్రీవెంకటపతి
అందె కస్తూరి వసంతమలమేల్మంగ
చిందుచుఁ దట్టు పుణుఁగు చిమ్ముచుఁ గూడాడేరు
సందడి సమరతుల-సంపెంగకాడ ॥ [26-49]

ఈ సంకీర్తనద్వారా అన్నమయ్య కాలం నాటికి వసంతోత్సవం స్థిర ప్రదేశంలోకాక కోనేటికాడ, నడిమ చింతాడ, సంపెంగకాడ నాయికా నాయకులకు విభిన్నరీతుల్లో జరుగుతుండేదని తెలుస్తున్నది. ఇది క్రియాత్మక వసంతం. వేంకటేశ్వరుడు వసంతోత్సవలాలసుడు. ఆతనికి అలమేలుమంగ సౌందర్యమే నిత్యవసంతోత్సవాన్ని సమకూరుస్తుంది.

అల్లదె నీ రమణి ఆయిత్తమై వున్నది
పెల్లుగ జాజరాడఁ బిలిచీఁ బోవయ్యా [17-172]

అనే సంకీర్తనలో తాయారు చూపుల్ని కలువల వసంతంగా, భర్తపట్లగల మోహాన్ని గంధంపు వసంతంగా, మనసులో కోరికల్ని మంచి నీళ్ళవసంతంగా, నవ్వుల్ని కప్పుర వసంతంగా, మోముకళల్ని వెన్నెల వసంతంగా, కొసరు పలుకుల్ని బంగారు వసంతంగా, ఆప్యాయతతో దగ్గరికి చేరదీసుకోవడాన్ని కెందామర వసంతంగా, భర్తస్పర్శవల్ల కలిగిన పులకల్ని ముత్యాల వసంతంగా వర్ణించాడు. పై సంకీర్తనలో అనురాగ జన్యమైన శారీరక మానసిక చేష్టాపరిణామాన్ని వసంతాలుగా జతచేసి చెప్పడం విశేషం.

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరునికి శ్రీకృష్ణునికి అభేదత్వాన్ని పాటిస్తూ ఎన్నో సంకీర్తనల్ని రచించాడు. శ్రీవేంకటేశ్వరుని రేపల్లె బాలునిగా అభివర్ణించి కృష్ణలీలల్ని మనోజ్ఞంగా చిత్రీకరించాడు. ఆ లీలల్లో ఉట్ల ఉత్సవం ఒకటి. తిరుమలలో శ్రావణ బహుళాష్టమి దినాన ఉత్సవమూర్తి మలయప్ప, శ్రీకృష్ణులవారు ఉట్ల ఉత్సవంలో పాల్గొంటారు.

అక్కలాల చూడుఁడందరును
నిక్కి వారవట్టీ నేఁడుఁ గృష్ణుఁడు ॥

మక్కువ నలమేలుమంగఁ గూడి నేఁడు
చొక్కి శ్రీవెంకటేశుఁడు వీథుల
నిక్కి వుట్టెల్లా నిండాఁ గొట్టివుట్టి
చక్కిలాలు గొట్టీ జగతీశుఁడు ॥ [8-149]

అని అలమేల్మంగా సమేతుడైన వేంకటవిభునికి జరిగే వుట్ల ఉత్సవాన్ని వర్ణించాడు.

అలమేలు మంగమ్మ ఆదిలక్ష్మియే। సుప్రసిద్ధ విశిష్టాద్వైత ప్రవక్త వేదాంత దేశికులవారు

సమస్త జననీం వన్దే చైతన్య స్తన్య దాయినీం
శ్రేయసీం శ్రీనివాసస్య కరుణామివ రూపిణీం ॥

[దయాశతకం-శ్లో-6]

ప్రపంచానికంతటికీ తల్లిగాను, మాతృత్వానికి చేరునట్లు జ్ఞానాన్ని పెంపొందించు పాలు ఇచ్చునదిగాను, దయాస్వరూపము కలదిగాను, శ్రీవారికి పలువిధాలైన శ్రేయస్సులను కలుగ చేయునదిగాను వున్న లక్ష్మికి నమస్కారం చేయుచున్నానని స్తుతిస్తారు.

అన్నమయ్య పదాల్లో అలమేల్మంగ ఆదిలక్ష్మిగా, లోక పాలకురాలిగా' జగన్మాతగా కీర్తించబడ్డది. అలమేల్మంగా శ్రీవేంకటేశ్వరులు లక్ష్మీనారాయణులే అన్నది భృగు వృత్తాంతంవల్ల స్పష్టం. అలమేల్మంగను ఆదిలక్ష్మి అనడాన్ని అన్నమయ్య 'వేంకటేశ్వర శతకం' లో నిర్దేశించడం గమనించతగ్గది.

చ॥ పరిమళమో కదంబమొ ప్రభల్ విడనించిన నిగ్గొ నిర్మలా
భరణమొ నిత్యవైభవమొ భాగ్యమొ శ్రీయలమేలుమంగ భూ
ధరునకు నాదిలక్ష్మియగు తత్త్వమహత్త్వరహస్య వేత్తలం
బరమున నుండి నీవనితఁ బ్రస్తుతి సేతురు వేంకటేశ్వరా ! [31 ప]

అంతేకాదు ఈ అభిప్రాయం సంకీర్తనల్లోకూడా ప్రతిధ్వనిస్తుంది.

శ్రీవేంకటేశ నీవు చెలియఁగూడినవేళ
ఆవటించి నిజలక్ష్మీ యన వచ్చును [15-5౮]

అనే సంకీర్తన చక్కని తార్కాణం,

లక్ష్మీదేవి నారాయణ వక్షఃస్థలవాసిని. ఆది శంకరులు విష్ణువక్షః స్థలవాసిని యైన లక్ష్మిని

బాహ్వాంతరే మధుజిత శ్శ్రిత కౌస్తుభేయా
హారావళీవ హరి నీలమయీ విభాతి
కామప్రదా భగవతోఽపి కటాక్షమాలా
కళ్యాణ మా వహతు మే కమలాలయ యాః ॥ [5 శ్లో]

కౌస్తుభమణిచే ప్రకాశించుచున్న విష్ణువుయొక్క వక్షఃస్థలానికి ఇంద్రనీలమణి హారముల ప్రకాశాన్ని కలిగించు శ్రీదేవి కటాక్షం నాకు శుభము నిచ్చుగాక అని స్తుతించియున్నారు. అలమేల్మంగను వక్షఃస్థలాన ధరించి వేంకటేశుఁడు ప్రకాశితుడైనట్లు కీర్తిస్తాడు అన్నమయ్య.

వో పెలమేల్మంగ నురమున నిడుకొని
దీపించె మణులలో తేజము వలెను ॥ [25-343]

తావుగా నలమేల్‌మంగ తన వురమెక్కగాను
వేవేలు సంపదలు వెలసినట్టుండెను ॥ [29-154]

స్థానం సంపాదించుకోవడమే కాదు స్థానికి తనవల్ల దీప్తి కలిగించిన ఇల్లాలు అలమేల్మంగ.

నిన్నుఁగూడిన విభుని నిలువెల్ల సొంపాయ [12-376]

అనే సంకీర్తనలో అలమేల్మంగ చనుగుబ్బల చక్రాలవల్ల వేంకటేశుఁడు చక్రపాణియైనాడని. పడతి కుంకుమ పూత హత్తుకోవడంవల్ల పీతాంబరుడైనాడని, ఇంతిపై ఆలింగనాపేక్షతో నాలుహస్తాల వాడైనాడని చమత్కరించాడు.

అన్నమయ్య అలమేల్మంగ తనంత తానుగా పతిపై హక్కు స్థాపించుకొన్న సామాన్య స్త్రీ కాదు. "అలమేల్మంగా రమ్మని" భర్త హార్దంగపిలిచి ఉరము మీద నిలుపుకొని "పూచండలు" వేస్తే మురిసిన ముద్దరాలు.

[29-377, 378]

సతి ఎడబాటు అనుభవించాడు కాబట్టి వేంకటవిభుఁడు తనకు తానుగా అలమేల్మంగను అనపాయినిగా తన వక్షఃస్థలాన అలంకరింప చేసుకొన్నాడు కాబోలు. అకారణమైన వ్యధ అప్యాయతలో కరిగి పోతుందనే సత్యాన్ని అన్నమయ్య ఇక్కడ వెల్లడించాడు. అలమేల్మంగను ఉరాన ధరించడం వేంకటపతి పూర్వభాగ్యమేనని కూడా

'ఏమిఁదపము సేసెనో యీతఁడు నీకుఁగా దొల్లి
ప్రేమతోడ నురమునఁ బెట్టుకొన్నాఁడిపుఁడు [24-58]

అని అన్నమయ్య అనడంలో వైకుంఠాన్ని వీడిన లక్ష్మీదేవి కోసం పద్మ సరోవరం తీరాన శ్రీనివాసుడు చేసిన తపస్సును సూచిస్తున్నాడు కాబోలు.

శృంగార పదరాశిలో శ్రీ కృష్ణస్వరూపుడుగా అభివర్ణింపబడ్డ వేంకటేశ్వరునికి భూదేవి, తులసి, అష్టమహిషులందరూ దేవేరులే! దేవేరులెందరున్నా పట్టమహిషిస్థానం ఆధిక్యతతో కూడుకొన్నది. అలమేలుమంగ తన అభినవ రూపంతో, నెరతనంతో, రసికతతో వేంకటపల్లభుని జట్టిగొన్నట్టి పడతి. అందుకే పట్టపురాణి కాగలిగింది. కాని ఆమె పట్టమహిషత్వాన్ని ఇతరసతులు అంగీకరించడంలోనే ప్రత్యేకత కన్పిస్తుంది. సవతి అయిన భూదేవి నోటనే "నీవే పట్టపుదేవులైతివే" [25-284] అని అలమేల్మంగ పట్టమహిషత్వాన్ని కొనియాడింపచేశాడు సంకీర్తనాచార్యుడు.

ప్రకృతి పురుషుల సంయోగమే ఈ సృష్టి. ప్రకృతిని స్త్రీగా పేర్కొనడం, ప్రకృతిపురుషుల్లో ప్రకృతికే ఆధిక్యత చెప్పడం నిర్ణీత విషయమే! లక్ష్మీదేవి ప్రకృతి స్వరూపిణిగా, జగన్మాతగా, సమస్త జగత్తుకు చైతన్య ప్రదాయినిగా పురాణాల్లో అనేక విధాలుగా స్తుతింప బడింది.

శ్రీమచ్ఛంకర భగవత్పాదులు లక్ష్మీదేవిని కనకధారా స్తవంలో

'శ్రుత్యై నమోఽస్తు శుభకర్మల ప్రసూత్యై
రత్యై నమోఽస్తు రమణీయ గుణార్ణవై
శక్త్యై నమోఽస్తు శతపత్ర నికేతనాయై
పుష్ట్యై నమోఽస్తు పురుషోత్తమ వల్లభాయై '॥

శుభ కర్మల ఫలితమైనట్టియు, వేదస్వరూపిణియైనట్టియు, సుగుణనిధియై ప్రీతితో భక్తులను ఆదరించునట్టియు, ప్రకృతి స్వరూపిణియు, కమలవాసియు,

లోకరక్షణాన మహావిష్ణువుకు తోడై తన లీలా విలాసానికి అనందించుచుండునో అట్టి శ్రీమన్మహాలక్ష్మీదేవికి నమస్కరించుచున్నానని ప్రస్తుతించారు.

వేంకటేశ్వర ప్రపత్తిలోని ప్రసిద్ధమైన 'ఈశానాం జగతోస్య' అనే శ్లోకం కూడా అలమేల్మంగను లోకపాలకురాలిగా, జగన్మాతగా కీర్తించునట్టిదే! ఈ తత్త్వార్థంతోనే

'చొచ్చితితల్లి నీ మఱుఁగు సొంపుగ నీకరుణా కటాక్షమె
ట్లిచ్చెదొ నాకు నేఁడు పరమేశ్వరి ! యో యలమేలుమంగ' [55ప]

అని వేంకటేశ్వర శతకంలోను

'గతి యలమేల్మంగతో శ్రీవెంకట
పతి యొకఁడిన్నిటఁ బాలించువాఁడు [8-22]

'మేలిమి లోకమాతయై మించిన మగువ యీపె
యీలీల లోకములేలే యిందిర యీపె [11-1-227]

'అందరి కన్నతల్లి ఆదిమూలమైన లక్ష్మి [13-3]

'చెదరని వేదముల చిగురుఁబోడి' [25-520]

అని పదాల్లోను అలమేల్మంగను లోకమాతగా, పరమేశ్వరిగా, లోకపాలకురాలిగా, ఆదిలక్ష్మిగా కీర్తించాడు.

కృతులై వేంకటశైల వల్లభ రతిక్రీడా రహస్యంబులై
నుతులై తాళులపాక యన్నయ వచోనూత్న క్రియల్ చెన్నగున్
[సం.ల.12-ప.]

అని అన్నమయ్య శృంగార పదాల తత్త్వార్థాన్ని గూర్చి తాళ్ళపాక చిన్నన్న సంకీర్తన లక్షణగ్రంథంలో పేర్కొన్నాడు.

జీవాత్మ పరమాత్మల తద్దైక్యాన్ని నాయికా నాయకుల అనురాగంగా మధురభక్తిపరంగా రచించడం భాగవతంలోను, ఆళ్వారుల రచనల్లోను, గీత గోవిందంలోను కన్పిస్తుంది. తనకు పూర్వమున్న వైష్ణవ సాహిత్యంలోని ఈవిధమైన మధుర భక్తి తత్త్వాన్ని, సాహిత్యరీతుల్ని ఆకళింపు చేసుకొన్నవాడే అన్నమయ్య. అందుకే ఇతని శృంగార పద రాశికి గోపికాభక్తి మూలమైంది.

భగవద్రతి ఆధారంగా జగత్కల్యాణ కారకమైన అలమేల్మంగా శ్రీనివాసుల దాంపత్యసౌభాగ్యం, ప్రణయ లీలావిలాసాలను వర్ణించాడు.

అలమేల్మంగా శ్రీనివాసుల అనురూప సంబంధ యోగాన్ని నిర్ణయించ డానికి ప్రాతిపదికగా అలమేల్మంగ యౌవన వికాసాన్ని "జాజర" పేరు మీద వేంకట విభునికి ఇలా విన్నవిస్తున్నాడు.

గౌళ

సారె నిన్నలమేల్మంగ జవ్వనవనమునను
 చేరి యవధరింతు విచ్చేవయ్య జాజర ॥

వసంతకాలము వచ్చె వనితమోవి ఇగిర్చె
 కొసరె యెలుఁగులను కోవిలగూసె
 ముసరీఁ జూపుల తేంట్లు మోఁతుగై వలపు పూచె
 రసికత నాడుదువు రావయ్య జాజర ॥

పున్నమ వెన్నెలగాసె కన్నుఁ గలువలు విచ్చె
 పిన్నలై చన్నులనేటి పిందెలు వుట్టె
 సన్నపుఁ జెమటలను జాలువారెఁ బన్నీరు
 చెన్నుమీర నాడుదు విచ్చేయువయ్యజాజర ॥

మరుఁడు విల్లందుకొనె మచ్చికలు గూడఁ జేసె
 పొరి పొరి సిగ్గులనే పుప్పొడిరాలె
 ఇరవై శ్రీవేంకటేశ యీకె నిట్టె గూడితివి
 సరుగ మీమీఁద మీరే చల్లరయ్య జాజర ॥ [24-249]

ఈవిధంగా అన్నమయ్య తన ముద్దుబిడ్డ అలమేలుమంగ యౌవన వికాసాన్ని వేంకటపతికి విన్నవించి కన్యాదాతగా ఇరువురికి లక్ష్మీనారాయణ యోగము రూపజనన స్థితిమూలకంగా కుదురుతుందని విశదపరుస్తున్నాడు ఇలా:

నాదరామక్రియ

ఈకెకు నీకుఁ దగు నీడు జోడులు
 వాకుచ్చి మిమ్ముఁ బొగడ వసమా యొరులకు ॥

జట్టిగొన్న నీదేవులు చంద్రముఖి గనక
 అట్టె నిన్ను రామచంద్రుఁడనఁదగును

చుట్టమై కృష్ణవర్ణపు చూపుల యాపె గనక
చుట్టుకొని నిన్ను కృష్ణుఁడవనఁదగును ॥

చందమైన వామలోచన యాపెయౌఁగనక
అందరు నిన్ను వామనుఁడనఁదగును
చెంది యాకె యప్పటిని సింహ మధ్యఁగనక
అంది నిన్ను నరసింహుఁడని పిల్వఁదగును ॥

చెలువమైన యాపె శ్రీదేవి యగుఁగనక
అల శ్రీవత్సుఁడవని యాడఁదగును
అలమేల్మంగ యహిరోమావళి గలదిగన
యిల శేషాద్రి శ్రీవేంకటేశుఁ డనఁదగును ॥ [30-552]

శృంగార రసాధి దేవతలైన అలమేల్మంగా వేంకటేశ్వరులకు స్థితి పరంగా కూడా అనుబంధం కుదురుతుందనే విషయాన్ని క్రింది విధంగా వెల్లడిస్తున్నాడు. దేహాన్ని దేవాలయంగా, రథంగాను సరిపోల్చే సంప్రదాయంతో

శుద్ధవసంతం

అలమేలుమంగ యీకె ఆనుక వద్దనుండది
చెలరేఁగి కందువలు చిత్తగించవయ్యా ॥

తరుణి దేహమే నీకు తగు దివ్యరథము
గరుడధ్వజంబాపె కప్పు పయ్యెద
తురగములు రతులఁ దోలెడు కోరికలు
సరినెక్కి వలపులు జయించవయ్యా ॥ [14-90]

అని తురిగీజాతి వర్ణనాపరంగా అలమేల్మంగ స్థితిని నాయకునికి తెల్పుతూ

గౌళ

అంగనకు నీవె అఖిలసామ్రాజ్యము
శ్రింగారరాయుఁడ నీకు శ్రీసతినిధానము ॥

కమలాల పానుపు కాంతకు నీవురము
ప్రమదపు నీమనసు పాలజలధి

అమరు నీ భుజాంతరమట్టె తీగె పొదరిల్లు
రమణీయ[ ప్ర ]హారాలు రత్నాలమేడలు॥

నెమ్మి నలమేల్మంగ నీకాఁగిలి పెండ్లిపీట
చిమ్ముల చందనచర్చ సేసపాలు
వుమ్మడి మెడనూళ్ళు వుయ్యాల సరపణులు
పమ్మి శ్రీవేంకటేశ నీభావమే భాగము [15-299]

అని తిరువేంకట నాయకుని స్థితిని కూడా తెల్పాడు.

అలమేల్మంగా శ్రీనివాసుల పరిణయానికి ఇరువురి సంబంధాన్ని, స్థితిని నిర్ణయించిన అన్నమయ్య కన్యాదాతగా కట్న కానుకాదుల్నిగూర్చి కూడా ప్రస్తావిస్తున్నాడు.

వివాహం కట్నకాదుకలతో కూడిన వ్యవహారం. పెండ్లికుమార్తె వైపు వారు ఏలోపం లేకుండా కట్నకానుకలు సమకూరిస్తేనే వివాహతంతు సౌమ్యంగా జరుగుతుంది. శ్రీధరునికి అన్నమయ్య సమర్పించు కోగలిగిన కట్నం ఏముంటుంది? పైగా అలమేల్మంగ సంపత్స్వరూపిణి. అందుకే అలమేల్మంగ తనకు తానుగానే అన్ని కట్నకానుకలతో సిద్ధమై నిలిచిందని ఏలోటు లేకుండా ఏలుకోమని నాయికాపరంగా వర్ణించడాన్ని క్రింది కీర్తనలో గమనించవచ్చు.

నాగగాంధారి

ప్రియురాలు నీకెదురువెట్టె వలపులునించె
నియుతాన నీవును మన్నించఁగదయ్యా॥

వనజాక్షి పయ్యెదలో వట్టువ చన్నులు నీకు
ననుపున నుంకువ ధనము బిందెలు
పెనగొన్న సింగారపుఁ బిరుదు బటువు దిండు -
తనరారు మంచి రత్నాలపెండ్లిపీఁట

అని క్రమంగా తురుములోని మల్లెమొగ్గల్ని ముత్యాలుగా, తేనెలమోవిని బువ్వపు పళ్ళెరంగా, బాహులతల్ని తోరణాలుగా వర్ణించి

అదరి శ్రీవెంకటేశ అలమేలుమంగ నీకు
కదలే కెప్పుడు మెడఁగట్టిన తాళి॥ [24-536]

అని స్పష్టం చేశాడు. ఇలా జగత్కల్యాణకారకమైన అలమేల్మంగా శ్రీనివాసుల పరిణయాన్ని వర్ణించి దివ్యదంపతుల ప్రణయలీలల్ని తన్మయీ భావంతో రచించి దివ్యానుభూతిని పొందిన పరమ భాగవతోత్తముడు అన్నమయ్య.

పెళ్ళివేడుకలలో పెళ్ళికొడుకు పక్షంవారు పెళ్ళికూతురిని, పెళ్ళికుమార్తె వైపువాళ్ళు పెళ్ళికొడుకుని నర్మమర్మోక్తులతో మేలమాడడం ఆనవాయితీ.

దేసాళం

అంగమెల్లఁ జెమరించె నమ్మఁగారికి
అంగజ రసములుబ్బీ నయ్యఁగారికి ॥

చెక్కునఁ బెట్టిన చేయి సెలవి నవ్విన నవ్వు
అక్కజమై తోఁచీనదె అమ్మఁగారికి
చక్కని మోముకళలు చెయివట్టి పెనగేటి
అక్కున వేడుకనిండె నయ్యఁగారికి ॥

మంచముపై సరసాలు మర్మముపై మంతనాలు
అంచుమోచె నెదుటనె అమ్మఁగారికి
కొంచక అలమేల్మంగఁ గూడినట్టి గురుతిదె
అంచ శ్రీవెంకటగిరి అయ్యఁగారికి ॥ [15-297]

పెళ్ళివేడుకల్లో ఇరుపక్షాలవారు సరసాలాడడాన్ని అలమేల్మంగా శ్రీనివాసుల కల్యాణవేడుకల్లో అన్నమయ్య హృద్యంగా చొప్పించాడు.

ఇలా దివ్యదంపతుల పరిణయాన్ని, ప్రణయాన్ని వర్ణించి
ఆకెవో నా ప్రాణమోహనపురాణి
దాకొని వేవేలు కాంతలలోన నున్నది ॥

నానాభూషణముల నానా సింగారాల
పానివట్టి నాదిక్కే తప్పక చూచేది
ఆనకపు శ్రీవెంకటాద్రి పతినైన నన్ను
తానెవచ్చికూడి నాదగ్గరనె వున్నది [15-79] అని

నానావిధాల తను నే నమ్మినదాన
యేనెపమూ నెఱుఁగనిదే విన్నవించరే ॥

వేయివిధముల శ్రీవేంకటేశుఁడిదే కూడె
యే యెడ నెన్నటికి నిదే విన్నవించరే॥ [18-199]

అని పరస్పర అన్యోన్య అనురాగాన్ని వెల్లడింప చేశాడు.

'వాక్యం రసాత్మకం కావ్యమ్' అనేది విశ్వనాథుని కావ్య నిర్వచనం. అన్నమయ్య ప్రతిపదకవిత రసాత్మకమైన ఉత్తమకావ్యలక్షణోపేత రచనయే। ఉత్తమ సాహిత్య లక్షణాలైన వర్ణనావైవిధ్యం, రస సంయోజనం, వ్యంగ్య వైభవం, అలంకార సంయోజనం మొదలైనవన్నీ అన్నమయ్య కృతుల్లో కనిపిస్తాయి.

అది శంకరాచార్యులు సౌందర్యలహరిలో అమ్మవారిని చిత్కళాస్వరూపిణిగా వినుతిస్తే అన్నమయ్య పదరాశిలో అలమేల్మంగను బహుకళారూపిణిగా అభివర్ణించాడు.

శ్రీయుతాకారుడూ, మానినీచిత్త చోరుడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి లోగొన దానికి అలమేలుమంగరూపం హేతువయింది. ఈదృష్టితోనే అన్నమయ్య అలమేల్మంగను బహుభంగుల వర్ణించాడు. అలాంటి వర్ణనాత్మక ఘట్టాలలో ప్రాదేశిక, ప్రకృతి, కైంకర్య విషయాల్ని రంగరించి చెప్పడం విశేషం.

భౌగోళిక ప్రదేశాల్ని నిర్దేశిస్తూ అలమేలుమంగ రూపం వర్ణించడంలో అన్నమయ్య స్వస్థలమైన తాళ్లపాకగ్రామం చుట్టూ ప్రాదేశికంగా పరిసరావృతమై షట్కోణయుత సుదర్శనాకృతిలో ఉన్న కనుమల్ని తెలుపుతాడు.

వరాళి

సొంపుల నీ వదనము సోమశిల కనుమ
యింపులెల్లఁ జేకొనఁగ నిల్లు నీపతికి॥

కలికి నీపిఱుఁదనే గద్దెరాతి కనుమ
............ ............ ............ ............
ఇదివో నీకెమ్మోవి యెఱ్ఱశిలకనుమ
............ ............ ............ ............

కాంత నీచిత్తమే దొంగలపోని కనుమ
యింత వేంకటపతి కిరవైనది
పంతపు నీ గుబ్బలే గుబ్బలికొండ కనుమ
మంతనాల కనుమాయ మగుప నీపతికి [12-115]

కేవలం కనుమలేకాదు అడవులు కూడా అలమేలుమంగ సౌందర్యానికి వస్తువులే।

అతఁడు చొచ్చినవేళ నలరు యడవి
సతినీదు మురిపెంపు జవ్వనపుటడవి॥ [12-153]

అనే సంకీర్తనలో కుచాల్ని గిరుల అడవిగా, బాహువుల్ని లతల అడవిగా వాలుచూపుల్ని తేంట్ల అడవిగా, తనుతావిని కప్పురపుటడవిగా, నెరుల చీకటిని పెను అడవిగా, జఘనాన్ని కంపకాల అడవిగా, నడకల్ని ఏనుగుల అడవిగా, నడిమిని సింహపుటడవిగా, ఊరువుల్ని అరంట్ల అడవిగా, పలుకుల్ని చిలుకల అడవిగా, వేంకటపతిని యాఁక అడవిగా, వేంకటవిభుఁడున్న చోటును తపమున్న అడవిగా వర్ణించాడు.

లక్ష్మీదేవిని ప్రకృతిస్వరూపిణిగా స్తుతించడం ప్రసిద్ధమే। అలమేల్మంగ నాయకుని పైని తలపులతో పొందిన శారీరక మనోగతమైన భావాలకు ప్రకృతి కూడా నేపథ్యమైంది. సంకీర్తన సృష్టికర్త అన్నమయ్య అలమేల్మంగనే 'సృష్టికర్త' అంటున్నాడు.

వరాళి

చెలియరో నీవే కదే సిష్టికర్తవు
నిలువున నీ మగఁడు నిను మెచ్చునమ్మా॥

బొమ్మల జంకించితేనే పొద్దుగుంకి నట్లాను
కమ్మి నీవు నవ్వితేనే కాయువెన్నెల
సొమ్ముల మోవి చూపితే చుక్కలు నాడుకొనును
నెమ్మది నీ రమణుఁడు నిను మెచ్చెనమ్మా॥

పొలఁతి నీవు చూచితే పొద్దువొడుచు నపుడే
పొలు యలుకల నెండ పొడ చూపును
తిలకించి నిలిచితే దిష్టమౌను లోకమెల్ల
నెలకొని నీవిభుఁడు నిన్ను మెచ్చెనమ్మా॥

యెక్కువై నీవు గూడితే నిరుసంజఁ దోచు
మొక్కిన నీ తురుముకు మూఁగు మేఘాలు
వొక్కటై నీ రతులను వోలార్చఁగా నేఁడు
నిక్కి శ్రీవేంకటేశుఁడు నిన్ను మెచ్చెనమ్మా ॥ [19-427]

అలమేల్మంగ పరంగా సూర్యోదయ సూర్యాస్తమయ చంద్రోదయాల్ని వర్ణించడం ఇతని భావనాసరణి.

పొలఁతికి నీతోపొందు పోఁకకుఁ బుట్టేఁడాయ
యెలమికి నీభాగ్యమిఁ కనెఁ (నెం)తైనా గద్దయ్యా ॥[29-66]

అనే సంకీర్తనలో పడతి చెక్కులవెంట పన్నీటివాన, నయనాలలో మెఱుగువాన, తురుమున విరులవాన, నవ్వుల ముత్యాలవాన, వలపుల జడివాన, సిగ్గుల తొలకరివాన, మోవి తేనెల సోనలవానలు కురిశాయని రతుల వానల్ని వర్ణించాడు. ఇట్లే

పాడి

చెలులాల యీమేలు చెలువుఁడే చూచుఁగాని
యెలమి తోడుక మొక్కి యెరిఁగించరే ॥

వనిత జవ్వనపు వసంతకాలములోనే
వెనుకొని విరహపు వేసవి మించె
ననిచెఁ బెంజెమట వానకాలము నంతలోనె
వినయముతోఁ బతికి విన్నవించరే ॥

కాంత పులకల శరత్కాలము నదె తోఁచె
చింతల మంచులతో హేమంతము ముంచె
చెంతఁ గోర్కులెన్నులెత్తి శిశిరవేళ యేతెంచె
యింతకు నీకె విభుని నిడకుఁ దోడి తేరె ॥

చెలియకుఁ గొప్పువీడె చీఁకటికాలము నందె
నెలకొనె సిగ్గుల వెన్నెలకాలము
అలమె శ్రీవేంకటేశుఁడంతలోనె తానెవచ్చి
పిలిచి సారెకునిట్టె ప్రేమరేచరే ॥ [22-428]

అనే సంకీర్తనలో ఋతువర్ణన నాయికాపరంగా చేశాడు. అలమేల్మంగ తిరువేంకట నాయకుని కోసం ఎదురుచూసి విసిగిపోయింది. కాలం గడిచింది. విభుడు రాలేదు. శారీరక మానసిక తాపం తీవ్రమైంది. వసంతకాలంలో ప్రకృతి పచ్చ పచ్చగా, శోభాయమానంగా, దర్శనీయంగా వుంటుంది. నాయిక వినూత్న సౌందర్యంతో దర్శనీయంగా వుంది. అందుకే నాయిక జవ్వనాన్ని వసంత కాలంతో సరిపోల్చాడు. విభుని ఎడబాటువల్ల విరహం హెచ్చింది. నాయికకు కలిగే తాపం శరీరానికి, మనస్సుకు సంబంధించినది. ఆ తాపం వేసవి కాలంగా భావింపబడింది. తనుతాప పర్యవసానంచే చెమటలు హెచ్చాయి నాయికకు. ముప్పతిల్లిన చెమటలు వానాకాలంలా ఉధృతమైనాయని అంతరార్థం. శరత్కాలంలో చల్లగాలి స్పర్శవల్ల పులకలు కలిగినట్లు పడతికి వెన్నెలవేళ విభునితో గడపిన మధురక్షణాల్ని తలచుకోవడంవల్ల పులకలు కలిగాయి. అది శరత్కాలంగా గోచరించింది. ఎంతకాలం నిరీక్షించినా ప్రియుని ఆగమనసూచన లేవీ లేకపోవడంతో ఆమె మనస్సును చింతలు కప్పేశాయి. అది హేమంత హిమంలా ఉందని భావన. ఇన్ని అవస్థలు పొందిన నాయికకు నాయకునితో గడపాలని అనుభవాలు పొందాలనే కోర్కెలు తీవ్రంగా మొలకెత్తాయి. అవి ఎన్నులా విజృంభించాయి. అది శిశిరంలో పంటలా ఎన్నులెత్తినట్లున్న దని భావన. వేంకట వల్లభుని సమాగమంలో ఆమెకొప్పు వీడి చిక్కని చీకటిలా నీలమేఘశ్యాముని అలముకోవడంచే చీకటికాలంలా తోచింది. తన విభునితో అనుభవం పొందడంచే ఆమెకు సిగ్గులు ముంచెత్తాయి. మగువలకు సిగ్గే కదా అందం! సిగ్గులొలకబోస్తున్న అలమేల్మంగను చూస్తున్న వేంకటవిభునికి వెన్నెల్లా అహ్లాదం కలగడంతో వెన్నెల కాలమైంది. భావ బంధురంగ నాయికాపరంగా సాగిన ఋతువర్ణన అన్నమయ్య భావోన్నతికి నిదర్శనం.

కైంకర్యం అంటే స్వామికి చేసే సేవాదులు. వాటిలో పూజలు ప్రధాన మైనవి. పూజకు పువ్వులు తప్పనిసరి. అలమేల్మంగ తమ్మి పూవెచ్చెలి. పరి కింపరాని అరవిరి సొబగుల, అరవిరి భావాల, అరవిరి మొక్కుల పుష్పవల్లి. అందుకే "మంగమ్మ" కు అన్నీ పూల పూజలే! వియోగానికి, సంయోగానికి "పుష్పయాగమే".

ముఖారి

దొరకెఁగా పూజ కందువ పూజ నీ
విరహపు తనుతావి విరవాది పూజ ॥

కలికి నీ కనుచూపు కలువరేకుల పూజ
అలన నీ నగవు మొల్లల పూజ
తలపోఁత చింత చిత్తపుఁ గమలపు పూజ
చలివేడి పూర్పు నీ సంపంగి పూజ ॥

కనలు (జెక్కున జేయి కరపల్లవపు పూజ
తను పులకలు జాజి ననల పూజ
తనరు నీ వలులు దొంతర పూవుల పూజ
యెనయు (జెమట మల్లె మొగ్గల పూజ ॥

చెనకు నీగోళ్ళ చిఱుఁ గేదగుల పూజ
గునియు గుబ్బలు పూవు గుత్తుల పూజ
ఘనతమైఁ గూడి వేంకటపతి మోము సోఁ-
కిన నీదు మోవి మంకెన పూవు పూజ ॥ [12-85]

అని 'అలర్-మేల్-మంగ' తో వేంకటవిభునికి పుష్పపూజా కైంకర్యం చేయించాడు.

దేవతా ప్రీతిగా చేసే అగ్నిహోత్ర కైంకర్యం యజ్ఞం.

కామ యాగము చేసెఁగలికి తన
ప్రేమయే దేవతా ప్రీతిఁగాను [12-233]

అనే సంకీర్తనలో కలికి సురత తాంబూల రసపానాన్ని నలినాక్షి సోమ పానంగా, ముద్దు పలుకుల్ని వేదమంత్రాలుగా, విరహాగ్నిని హోమాగ్నిగా, సమరతుల చెమటను అవభృథంగా, దంతక్షతాక్రీడల్ని పశుబంధనంగా, శ్రీవేంకటేశ్వరుని పొందును దివ్యభోగంగా యాగవిధానాన్ని పేర్కొన్నాడు. ఇవేకాక

వెలయు నీ కళ్యాణవేదిగా మతినుండి
కలికి జవ్వనపు యాగము సేసెనతఁడు [12-288]

పూవుఁబోణుల కొలువే పుష్పయాగము
  పూవక పూచె నీకిట్టి పుష్పయాగము ॥ [13-60]

అనే యాగ సంకీర్తనలుకూడ కైంకర్యనేపథ్యానికి చెందినవే.

శృంగార హాస్య కరుణ రౌద్రవీర భయానకాః
బీభత్సాద్భుత సంజ్ఞౌచే త్యష్టౌ నాట్యే రసాః స్మృతాః ॥

అనేవి ఎనిమిది రసాలని భరతుని నాట్యశాస్త్రం.

రసోవై సః- పరమాత్ముడు రసస్వరూపుడు. అందుకే అలమేల్మంగను రసస్వరూపిణిగా అభివర్ణించాడు అన్నమయ్య.

వేంకటేశ్వర శతకంలో

చక్కని తల్లి నవరసంబులవెల్లి పుష్పవల్లి
చక్కని మోవి ముత్తియపు జల్లి [49 వ]

అని అలమేల్మంగను 'నవరసంబులవెల్లి' అని సూచనప్రాయంగా వర్ణించిన అన్నమయ్య పదరాశిలో ఆమె హావభావాదులకనుగుణ్యంగా

నవరసములదీ నళినాక్షి
  జవకట్టి నీకు ఁజవి సేసీని ॥

శృంగార రసము చెలియ మొకంబున
  సంగతి వీరరసము గోళ్ళ
  రంగగు కరుణరసము పెదవులను
  అంగపు ఁగుచముల నద్భుత రసము ॥

చెలి హాస్యరసము సెలవుల నిండీ
  పలుచని నడుమున భయరసము
  కలికి వాడుఁగన్నుల బీభత్సము
  అల బొమ జంకెనల నదె రౌద్రంబు ॥

సతి రతి మరపుల శాంతరసంబదె
  అతి మోహము పదియునరసము
  ఇతవుగ శ్రీవేంకటేశ కూడితివి
  సతమై యీ పెకు సంతోస రసము ॥ [13-282]

అని నవరసాల్ని పేర్కొనడమే కాకుండా అతివ "అతిమోహాన్ని" పదో రసంగా పేర్కొంటూ "సంతో సన"రసంతో పదకొండు చేశాడు. ఎనిమిది తొమ్మిది కావడం శాస్త్ర సమ్మతం. అవి పదో పదకొండో కావడం అన్నమయ్య 'కొండలయ్య మతం'.

అన్నమయ్య కేవలం సంకీర్తనాచార్యుడే కాదు. కవి, పండితుడు కూడా ఆ వాగ్గేయకారునికి తెలియని శాస్త్రం లేదు. శాస్త్ర విషయాల్ని శాస్త్రీయంగా చెప్పడం కాక కవిత్వంతో రంగరించి చెప్పగల ప్రతిభాశాలి.

'వజ్రం ముక్తా ప్రవాళంచ గోమేధశ్చేంద్ర నీలకః
వైడూర్యం పుష్యరాగశ్చ పాచి ర్మాణిక్యమేవ చ
మహారత్నాని చైతాని' శు.నీ.—4—2—41

అనేవి నవరత్నాలని శుక్రనీతి సారంలో చెప్పబడింది. సకల సంపదలు అనుగ్రహించే లక్ష్మికి నవరత్నాలకు కొదవా! అందుకే అలమేల్మంగను వేంకట విభుని రత్నాల పెట్టెగా వర్ణించడం క్రింది సంకీర్తనలో గమనించవచ్చు.

నాదరామక్రియ

నెలఁత చక్కదనమే నిండు బండారము నీకు
గలిఁగె ఁగనకలక్ష్మి కాంతుఁడవైతివి ॥

పడతి నెమ్మోమునకు బంగారు కళలుదేరీ
వెడలే సెలవి నవ్వే వెండిగనులు
అడియాలమగు మోవినదె పగడపుఁదీగె
నిడువాలుదనమే నీలముల రాశి ॥

తరుణి పాదపు గోళ్ళు తళుకుల వజ్రములు
పరఁగు జేతిగోళ్ళే పద్మరాగాలు
అంది కన్నుల తేటలాణి ముత్తెపు సరులు
సరిఁ బచ్చల కొండలు చనుమొనలు ॥

చెలితేనె మాటలు జిగిఁ బుష్యరాగాలు
వలపు తెరసిగ్గులు వైడూర్యాలు
తొలఁకు ననురాగాలే దొడ్డగోమేధికాలు
కలసితి కెను శ్రీవేంకటేశు కాఁగిటను [24-108]

సంపద నిండుగా వుంటేనే ఖజనాకు నిండుదనం. అలమేల్మంగ యౌవన సంపదతో పరిపూర్ణంగా వుంది కనుక వేంకటవిభునికి నిండుభండారం వంటిదని తెలియచేశాడు అన్నమయ్య.

పడతిమోము పసిమి ఛాయతో శోభిల్లుతున్నది కనుక బంగారంతోను, నవ్వులు నిర్మలమైనవి, తెల్లనైనవి కనుక స్వచ్ఛతకు సంకేతంగా వెండితోను, మోవి ఎర్రదనాన్ని పగడంతోను, నీలకుంతలి కనుక నీలాల రాశితోను, పాదపు గోళ్ళు ప్రకాశిస్తుండడంబట్టి వజ్రాలతోను, చేతిగోళ్ళు రక్తిమంగా వుండ డంచే పద్మరాగాలతోను ఇత్యాదిగా నవరత్నాల ధర్మాన్ని బట్టి అలమేల్మంగను విభుని రత్నాలపెట్టెగా అభివర్ణించాడు.

భూత భవిష్యద్వర్తమానాల్ని తెల్పే శాస్త్రం జ్యోతిశ్శాస్త్రం. జ్యోతిషంలో రాశుల, గోచారాల, గ్రహస్థితులద్వారా భూతభవిష్యద్వర్తమానాల్లో కలిగే పరిణా మాల్ని తెలుసుకోవచ్చు. అన్నమయ్య నాయికా పరంగా ద్వాదశ రాశుల్ని వర్ణించిన క్రింది కీర్తన గమనించండి.

శుద్ధరామక్రియ

ఇన్నిరాసుల యునికి యింతి చెలువపు రాశి
కన్నె నీ రాశి కూటమి గలిగిన రాశి॥

కలికి బొమ విండ్లుగల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
చెలఁగు హరిమధ్యకును సింహరాశి॥

చిన్నిమకరాంకపుఁ బయ్యెద చేడెకు మకరరాశి
కన్నె పాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైఁడి తులఁదూగు వనితకుఁ దులారాశి
తిన్నని వాఁడి గోళ్ళ సతికి వృశ్చికరాశి॥

ఆముకొను నొరపుల మెరయు సతివకు వృషభరాశి
గామిడి గుట్టుమాటల సతి కర్కాటకరాశి
కోమలపు చిగురుమోవి కోమలికి మేషరాశి
ప్రేమ వేంకటపతి (గలిసె ప్రియ మిథునరాశి॥ [12-143]

కావ్యాల్లో స్త్రీల కనుబొమలను ధనుస్సుతో పోల్చడం బట్టి ధనురాశిగా, నయనాల్ని మీనాలతో పోల్చడంబట్టి మీనరాశితోను, కుచాల్ని కుంభాలతో పోల్చడం బట్టి కుంభరాశితోను, నడుమును సింహమధ్యగా చెప్పడంబట్టి సింహరాశితోను కవిసమయాల ననుసరించి పోల్చడం జరిగింది. అలమేల్మంగ నిత్యవధువు కనుక కన్నెప్రాయపు సతేః కనుకే కన్నెరాశిగాను, పసిమి ఛాయతో తులతూగే వనిత కనుక తులారాశిగాను, అనపాయిని కనుక వేంకటపతి తోడి పొందులో మిథున రాశిగాను అలమేల్మంగను రాశుల కూటమి కలిగిన వనితగా వర్ణించాడు. సహ ధర్మచారిణి రాశిఫలమే శ్రీనివాసుని వైభవరాశి.

హైందవ సతిలక్షణాన్ని భూమికగా తీసుకొని వేంకటపతి సతియైన అలమేల్మంగ స్వభావాన్ని వర్ణిస్తాడు.

బౌళి

సేస పెట్టవయ్యా ఇట్టి చెలిమీఁదను
  ఆసల మీకిద్దరికి నన్నిటా నమరును ॥

గక్కనఁ జెట్టవట్టితే కంకణము వంటిదాపె
  దక్కి వురమెక్కితేను తాళివంటిది
  మొక్కలానఁ దొడ దొక్కితే మొలనూలు వంటిది
  అక్కజమై నీకు నాపె నన్నిటా నమరును ॥

చేరి విన్నవించితే చెవి పోగుల వంటిది
  నీరతికి వద్దనుంటే నీడ వంటిది
  కోరి పానుపుపై పెండ్లికూతురు వంటిదేపొద్దు
  ఆరీతి ఆపెకు నీకు నన్నిటా నమరును ॥

పాదాల సేవ సేసితే పావకోళ్ల వంటిది
  సోదించి చూచితేను సొమ్ము వంటిది
  యీదెస శ్రీవేంకటేశ యింతి నీవుఁగూడితివి
  ఆదిగాని నీకు నాపె కన్నిటా నమరును ॥ [27-353]

ఈ సంకీర్తనలో వుపమానాల వస్తుతత్త్వాన్నిబట్టి అలమేల్మంగ స్వభావ వర్ణన చేయబడ్డది.

వివాహ సమయంలో జరిగే పవిత్రకర్మల్లో కంకణధారణ ఒకటి. సహ ధర్మచారిణి అయిన ఇల్లాలితో సత్కార్మలు చేయాలనే నియమాన్ని కంకణధారణ సూచిస్తుంది. తాళి వివాహబంధానికి, సౌభాగ్యానికి సంకేతం. నాయిక విభుని వక్షఃస్థలాన్ని అలంకరరించినపుడు తాళి వంటిదని చెప్పడంలో అనపాయినిగా సౌభాగ్యవతిగా విలసిల్లేదని స్పష్టమవుతోంది. మొలనూలు జఘనాన్ని అలంకరించినట్లు నాయిక నాయకుని పెనవేసుకొని వుంటుంది. కనుకే మొలనూలు వంటిదన్నాడు కవి. పరస్పర సమాగమంలోని పలుకులు అస్పష్టంగా వుంటాయి. పోగులు చెవికి శోభనిస్తాయి. అలాగే సమాగంలోని నాయిక పలుకులు నాయకునికి అలంకారాలే। అందుకే చెలిపలుకులు చెవి పోగులుగా పోల్చబడ్డాయి. ఎండ వేడిమి సోకిన తర్వాతనే నీడ సుఖం తెలుస్తుంది. అలాగే పతితనుతాపం తరుణి రతిలో తీరి నీడలా సుఖాన్ని కలిగిస్తుంది. అలమేల్మంగా వేంకటపతులది దివ్య దాంపత్యం. వారిది తరగని యౌవనం. చెరగని సొగసు. అందుకే అలమేల్మంగ "నిత్యపెళ్ళికొడుకైన" స్వామికి ఏ పొద్దు పానుపుపై పెండ్లి కూతురుగానే భాసిస్తుంది. నిరంతర పతిసేవాయత్తచిత్తసతి అలమేల్మంగ మంగమ్మ. కనుకే పతిదేవునికి పాదరక్షలై అమరుతుందట. అలమేల్మంగ సంపత్స్వరూపిణి కదా। సొమ్ము ఆకర్షణీయమైందేకాదు. ఆపేక్షణీయమైది, కాపాడుకో తగ్గది కూడా। పెట్టిన సొమ్ములు ఊదేవి. శ్రీనివాసునికి అలమేల్మంగ పెట్టని సొమ్ము.

అన్నమయ్య పదరాశిలో దివ్యనాయికయైన అలమేల్మంగ స్వరూపం స్థితి, అవస్థా భేదాల్ని బట్టి అనేక విధాలుగా ప్రత్యక్షమవుతుంది.

కావ్యాల్లో నాయికా రూపవర్ణనకు విశేష ప్రాధాన్యం వుంది. ప్రబంధాలు ఈ వర్ణనలకు పట్టుకొమ్మలు. పదాలు దేశి ప్రక్రియా శాఖకు చెందినవి. అయినా అన్నమయ్య కావ్యలక్షణ గ్రంథాల్లో పేర్కొన్నట్టు కవి సమయాలకనుగుణంగా దివ్యనాయిక అలమేల్మంగను అనేక విధాలుగా వర్ణించాడు.

సృష్టిలో ప్రతివస్తువుకు ఒక సౌందర్యంవుంటుంది. ఒక ధర్మంవుంటుంది. శృంగార రసాధి దేవతయైన అలమేల్మంగ అంగాంగ సౌందర్యం వర్ణించడానికి ఒక ఔపమ్యమే చాలదు. అందుకే అన్నమయ్య క్రమంగా కావ్యాల్లో ప్రసిద్ధమైన ఔపమ్యాలన్నింటితోనూ ఇలా పోలుస్తున్నాడు.

ఒకటిఁ బోలిచిన వేరొకటి మరి తోఁచీని
సకలముఁ బోలిచేము సుదతి సింగారాలు ॥

కలువలుఁ జకోరాలు గండుమీలుఁ దామరలు
చలిముత్తై పుఁజిప్పలు సతికన్నులు
అలలు నీలమణులంధకారము మేఘము
నలుపు రాశివో నలినాక్షి తురుము ॥

జక్కవలు నిమ్మపండ్లు సరిఁ బూగుత్తులుఁగొండ
లెక్కువ మరుమిద్దెలు యింతి చన్నులు
చుక్కలు సురపొన్నలు సూది వజ్రాలు గోళ్ళు
అక్కర యేనుఁగ తొండాలరంట్లే తొడలు ॥

సోగ తీగెలు తూండ్లు సుదతి బాహువులివె
చేగ చిగురు లత్తిక చెలి పాదాలు
యీగతి శ్రీవేంకటేశ యింతి నీ వురము మీద
బాగుగ నమరి పైఁడి పతిమఁ బోలినవి ॥ [13-281]

ఇంతి కన్నుల్ని కలువలనడంలో స్నిగ్ధత, చూపుల చల్లదనం; చకోరాల నడంలో విభుని కోసం నిరీక్షించే గుణం; గండు చేపలనడంలో పడతి కన్నుల సోగ తనం, చంచలత్వం; తామరలనడంలో వికసితత్వం; ముత్తెపు చిప్పలనడంలో కన్నుల తెల్లదనం, శ్రేష్ఠత్వం విదితమవుతున్నాయి.

తురుమును అలలనడంలో కాలిమ, నీలమణులనడంలో నైగనిగ్యం, అంధకారం అనడంలో నైల్యం, మేఘమనడంలో రతివేళలో విభుని పెనగొన్నప్పుడు కొప్పుతో క్రమ్ముకొనేదని వ్యక్తం.

చన్నుల్ని జక్కవలనడంలో జంటబాయని గుణాన్ని, నిమ్మపండ్లనడంలో పూర్ణత్వం, పసిమితనం, పూగుత్తులనడంలో రూపమార్దవాలు, కొండలనడంలో ఔన్నత్యం,కాఠిన్యం. మరుమిద్దెలనడంలో యౌవన విజృంభణత్వం తెలియపర్చడం.

గోళ్లని చుక్కలనడంలో దర్శనీయమైనవని, సుర పొన్నలనడంలో పసిమితనం, సూది వజ్రాలనడంలో పదునైనవని చెప్పడం.

తొడల్ని ఏనుగులనడంలో మందగమనం, అరంట్లనడంలో నునుపు దనం వ్యక్తం.

బాహువుల్ని తీగలనడంలో ఆలంబనం కోరుకొనేవని, తిరువేంకట నాయకుని పెనవేసుకొని పోయేవని అర్థం. తూండ్లనడంలో బాహువులు మృదువుగా తీర్చినట్లు వున్నాయన్నది వ్యక్తం.

పాదాల్ని చిగురులనడంలో లాలిత్యం, లత్తికలనడంలో అరుణిమ వ్యక్తమవుతున్నాయి.

ఇలా ప్రసిద్ధమైన అనేక ఔపమ్యాల గుణతత్త్వాన్ని అనుసరించి అలమేల్మంగ దివ్యసౌందర్యాన్ని వర్ణించడం అన్నమయ్యకే చెల్లింది. మదన సామ్రాజ్యలక్ష్మియైన అలమేల్మంగ తన అభినవ రూపంతో వేంకటవిభుని ఎలా వశపరుచుకొన్నదో అన్నమయ్య వర్ణించిన క్రింది కీర్తన పరికించండి. ఆమె అందం, ఆభిజాత్యం, చూపులు, మాటలు అన్నీ కలిసి అభినవరూపమై వేంకట పతిని వశపరచుకొన్నది.

అలమేలుమంగ నీవభినవరూపము
   జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మా ॥

గరుడాచలాధీశు ఘన వక్షమున నుండి
   పరమానంద సంభరితవై
   నెరతనములు చూపి నిరంతరము నాథుని
   హరుషించగ ఁజేసితి గదమ్మా ॥ [12-160]

అలమేల్మంగ వెంకటపతిని వశపరచుకొనినదనడమే కాదు తన ముద్దుబిడ్డ సౌందర్యాతిశయం, ఎంతటి ఆధిక్యతతో కూడుకొన్నదో చెలులచే విభునికి హెచ్చరికగా విన్నవింప చేస్తున్నాడు అన్నమయ్య.

మోహము సేయించుకొని మురిసేవు నీ
   సాహసములెదురా చదురాలికిపుడు ॥

ఒక్క చక్రమె నీకున్నదిగాని యింతి
   రెక్కల చక్రాలెవో రెండుగుబ్బలు
   మక్కువ సేయించుకుని మలసేవు నీ
   చక్కదన మెదురా జవరాలికిపుడు ॥

నీలమేఘము చాయ నీమేనుగాని పెద్ద
నీలమేఘమే వో నెలంత కొప్పు
మరుని ప్రతినిధి నీ మహిమ గాని ఆ
మరుని సంపదే వో మగువనేఁడు॥ [12-71]

మరుగుపనిగా కీర్తించబడ్డ వేంకటవిభునికి అలమేల్మంగ సౌందర్యాధిక్యతను వర్ణించడం అన్నమయ్యకే చెల్లింది.

ఆమె సౌందర్యాతిశయం వేంకటవిభుని విరహానికి హేతువైంది. నాయిక రూపును మనసా వాచా తలపోయడంతో విభుడు తృప్తి చెందక చిత్రించడానికి పూనుకొన్నాడు.

సతి చక్కఁదనమెంతో సరసుని మోహమెంతో
చతురులింక సరిఁ జూడరమ్మా॥

కాంత కన్నులు వ్రాసి కడలు వ్రాయఁగ రాక
చింత తోడఁ దలవంచెఁ జెలి విభుఁడు
పంతపు నడుము వ్రాసిఁబయలు వ్రాయఁగ రాక
కొంత దడ వున్నరనెఁ గోమలి ప్రాణేశుఁడు॥

కలికి కుచాలు వ్రాసి కఠినము వ్రాయలేక
తలపోయఁ దొడఁగెఁ బంతపు విభుఁడు
నలినాక్షి మోము వ్రాసి నవ్వులు వ్రాయఁగరాక
నిలువున వెరగందె నెలఁత రమణుఁడు॥

వనిత కాఁగిటఁ దన్ను వ్రాసి రతి వ్రాయలేక
తనువెల్ల మఱచెను తమకమున
వెనక ముందర వ్రాసి వేడుక వ్రాయఁగరాక
చినుకుఁ జెమట వ్రాసె శ్రీవేంటేశుఁడు॥ [29-590]

విరహావస్థన్న అనుభవిస్తున్న వేంకటవల్లభునికి ఆమె దివ్యసౌందర్యం, హావభావాలు కుంచెకు అందలేకపోయాయి. ఇట అలమేల్మంగది మనోనేత్రానికందే దివ్య సౌందర్యమని అన్నమయ్య చెప్పక చెప్పడం.

అన్నమయ్య శృంగార సంకీర్తనల్లో అధ్యాత్మతత్త్వం సర్వత్ర ధ్వనిస్తుంది.

నిన్ను బాసినయట్లు నెలతకు వియోగదశ
లెన్నడను దోప విదియేమోకాని ॥

నిను దలచి లలితాంగి నీరూపమాత్మలో
గని నీవు సవి బయులు కౌగిలించినది
తనర నాకాశ తత్త్వము నీమహాత్త్వమని
వనిత యెవ్వరి చేత వినెనో కాని ॥

నిను బొగడి నీరూపు కనుదోయి కెదురైన
తనివిదీరక బయులు తగ జూడ దొడగె
మునుకొన్న సర్వతోముఖుడ వనగా నిన్ను
వెనకకే భావమున వినెనోకాని ॥

తలపునను వాక్కునను తలపఁ దలపగ నీవు
కలసి యాకమలాక్షిఁ గౌగిలించితివి
తెలిసితిమి వేంకటాధిపతి నీ విన్నింట
గలవనెడి మాట నిక్కంబులో కాని ॥

ఇట పరమాత్మని ఎడబాటులో నాయిక అనుభవిస్తున్న విరహాన్ని అధాత్మ భావంతో చెలికత్తె మాటల్లో విన్పించబడింది.

నాయకుని ఎడబాటు వల్ల కలిగిన విరహాతిశయం తనను వేధించినా

'నానా విధాల తను నే నమ్మినదాన' [18-199]

అని అంటున్నది అలమేల్మంగ. వల్లభుని రాక ఆమెకు అవధులు మీరిన సంతోషాన్ని కలిగించింది. అందుకే ఎంతో అనుకూలవతిగా నడయాడే వనితగా చిత్రీకరిస్తున్నాడు.

వేసరించేదానఁగాను వేగినంతా నిన్నును
రాసికెక్క నీకృపనే రతిఁ జెలఁగుదును ॥

నట్టనడుమనే నీవు నావాఁడవై వుండేఁజాలు
అట్టి నే నెంతటి నైనా నౌదును
గుట్టుతోడ నీవు నాకుఁ గొలువిచ్చితేఁ జాలు
నెట్టన లోకమునకు నేనే రాజనౌదును ॥

కందువ నీవు నన్నుఁ గన్నులఁ జూచితేఁజాలు
అందుపు సిరుల నోలలాడుదును
మందలించి నాతో నొక మాటాడితేనే చాలు
పందెమాడి నీచే తుదిపదము చేకొందును ॥

చేరి శ్రీవేంకటేశ్వర సెలవి నవ్వితేఁ జాలు
కోరి నీవలపులకు గురి యౌదును
సారె నలమేల్మంగను సతి నీకు సై తేఁ జాలు
మేరతోఁ గూడితిని మేలెల్లా సాధింతును ॥ [18–147]

ఇట అలమేల్మంగ వేంకటపతి చేరువలో, కనుసన్నలలో, పలకరింపులతో పులకరించిపోయే సామాన్య జీవనాయికగా వర్ణించబడింది. పరమ్మాతువి సన్నిధి, కరుణాకటాక్షం, ప్రబోధ, పదసాన్నిధ్యం పొందడం జీవాత్మ విశిష్ట లక్షణాలని దివ్యనాయిక పరంగా ప్రస్ఫుటీకరించడం జరిగింది.

పరమాత్మ స్వరూపుడైన వేంకటవిభుని సాన్నిధ్యం పొందడమే కాదు తాదాత్మ్యం చెందడమూ దివ్యానుభూతే। పడతి అనుభవించిన రతివిహారం మోహం వేంకటవిభునికేవన్నె చేకూర్చునట్టివే।

ఎవ్వరికిఁగలదమ్మ యింత సౌభాగ్యము
యివ్వల నీతో సరి యెంచరాదే వొరుల ॥

వీడిన తురముతోడ విరులు పై పై రాల
వాడిక కన్నులతోడ వచ్చేవేమే ॥

వడియుఁ జెమటతోడ వత్తివంటి మోవితోడ
నడపు మురిపెముతోడ నవ్వేవేమే ॥

నిద్దుర కన్నులతోడ నిండుఁబులకలతోడ
ముద్దుగారే మోముతోడ మురిసేవేమే
వొద్దనే శ్రీవేంకటేశుఁదొగిఁగూడు తెలుగమే
ముద్దురాల నేఁడు నీ మోహ మెంచరాదే ॥ [ -42]

పదాలు దేశిగాన ప్రక్రియకు చెందినవి. పామర జనాకర్షణకై జానపద గేయరీతుల్లో వైష్ణవ తత్త్వాన్ని ప్రబోధించాడు అన్నమయ్య. వీరి జానపద రీతుల్ని గూర్చి క్రీ॥శే॥వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్య చరిత్ర పీఠికలో 'జాజఱలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెద పదములు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, జోజో, జేజే, జయ జయ, విజయీ భవ, శోభన, మంగళ, వైభోగములు, మేలుకొలుపులు, నలుఁగులు దంపుళ్లు, కొట్నాలు, కూగూగులు, గుజ్జెన గూళ్లు, చందమామ గుటకలు, నివాళులు, ఆరతులు, మంగళారతులు, జయ మంగళాలు, అల్లో నేరెళ్ళు, చాఁగుబళాలు, బళాబళాలు, సాసముఖాలు, అవధానములు, తందానలు, వెన్నెలలు, చిత్తమా, మనసా, బుద్ధి (సంబోధనలు) మొదలగు రచనా విశేషములీ సంకీర్తనములలో 'ఁజాలఁగలవు' అని పేర్కొన్నారు,

అన్నమయ్య పదాల్లో అలమేల్మంగపై అల్లోనేరెళ్ళు, చిందులు, ఛాగు బళా, ఏలలు, పెండ్లిపాటలు, నివాళులు, అరతులు కన్పిస్తున్నాయి. అన్నమయ్యకు పూర్వం కేవలం పాల్కురికి సోమనాథుని రచనల్లోనే చిందులు, కోలాటాలు, ఛాగుబళా, జాజర ప్రక్రియల ప్రసక్తి కన్పిస్తుంది.

ఛాగు-బళా ప్రశంశావాచకపదం. పాల్కురికి సోమనాథుడు వీటిని ఆనందపదాలుగా పేర్కొన్నాడు. పదిమంది గుంపుగా కూడి తాళాన్ని అనుసరించి కోలలతో తట్టుకొనుచు పాడుకొను నృత్తగీతాలే ఆనంద పదాలు. అలమేలుమంగ అసాధారణ సౌందర్యానికి అన్నమయ్య మురిసి చేసిన ప్రశంసా పూరన్వక రచనయే ఈ క్రింది ఛాగుభళా పదం.

పాడి

చక్కని తల్లికి చాఁగుబళా తన-
చక్కెరమోవికి చాఁగుబళా ॥

కులికెటి ముదిపెపుఁ గుమ్మరింపుఁ దన-
నళపుఁ జూపులకు చాఁగుబళా
పలుకుల సొలపుల ఁబతితోఁ గసరెడి
చలముల యలుకకు చాఁగుబళా ॥

కిన్నెరతోఁ బతికెలన నిలుచుఁదన
చన్ను మెఱుఁగులకు చాఁగుబళా
ఉన్నతిఁ బతిపై నొరగి నిలుచుఁదన -
సన్నపు నడిమికి చాఁగుబళా ॥

జందెపు ముత్యపు సరుల హారముల
చందన గంధికి చాఁగుబళా
విందయి వేంకట విభుఁ బెనచిన తన -
సంది దండలకు చాఁగుబళా ॥ [12-107]

ఈ చాగుబళా ప్రసక్తి వేంకటేశ్వర శతకంలో కూడా కలదు.

చాఁగుబళా జగత్పతికిఁ జాఁగుబళా జగదేక మాతకున్
చాఁగుబళా రమేశునకుఁ జాఁగుబళా యలమేలుమంగకున్
జాఁగుబళా యటంచుఁ గడుఁ జక్కని కాంతను వీథి వీథి మీ
రేఁగఁగ నిత్తురాతతు లనేక విధంబుల వేంకటేశ్వరా! [54 వ]

స్త్రీల పాటల్లో ప్రసిద్ధమైనవి అల్లోనేరెళ్ళు. ఇది శృంగార ప్రధానమైన రచనయే। పెద్ద నేరుడు పండ్లను అల్లనేరెళ్ళు అంటారు. ఇదే క్రమంగా అల్లోనేరెళ్ళు అయింది. అలమేల్మంగను ఉద్దేశించిన అల్లనేరెళ్ళపాట:

దేసాళం

నెయ్యములల్లో నేరెళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో ॥

పలుచని చెమటల బాహుమూలముల
చెలమలలోనాఁ జెలువములే
ధళ ధళ మను ముత్యపుఁ జెఱఁగు సురటి
దులిపేటి నీళ్లతుంపెళ్ళో ॥

గర గరికల వేంకటపతి కౌఁగిట
పరిమళములలో బచ్చనలు
మరుని వింటి కమ్మని యంప విరులఁ
గురితాఁకులినువ గుగ్గిళ్ళో ॥ [12-178]

వెన్నెలవేళ స్త్రీలు అభినయ పూర్వకంగా ఆడుతూ తిరుగుతూ పాడేవి చిందుల పాడే పాటలు.

అలరులు గురియఁగ-నాడెనదే
అలకలఁగులుకుల-నలమేల్‌మంగ ॥

చిందులపాటల-శిరిహొలయాటల
అందెలమోఁతలనాడెనదే
కందువ తిరువెంకటపతి మెచ్చఁగ
అందపు తిరుపుల-నలమేల్‌మంగ ॥ [12-24]

అనే సంకీర్తనలో అలమేల్మంగ నృత్యాన్ని వర్ణిస్తూ అన్నమయ్య చిందుల పాటలను పేర్కొన్నాడు.

నాయికాహ్వాన పూర్వమై నయము గలిగి
మ్లేచ్ఛ సంభాష ఁదగి రాగమిశితమైన
యేలపాట పదంబుగా నిలఁ జెలంగు
మహిత నాయక సంబుద్ధి మధ్యమగుచు [స. ల. -65 ప]

అని చిన్నన్న ఏలలనుగూర్చి సంకీర్తన లక్షణగ్రంథంలో పేర్కొన్నాడు. సంగీతరత్నాకరంలో శార్ఙ్గదేవుడు ఏలపదంలో 16 పదాలు వుండాలని పేర్కొన్నాడు. వేంకటవిభునికోసం పరితపించే నాయికగా అలమేల్మంగ ఏల పదంలో చిత్రీకరింపబడడం క్రింది సంకీర్తనలో గమనించవచ్చు.

దేసాళం

మేడలెక్కి నిన్నుఁ జూచి-కూడేననే యాసతోడ
వాడుదేరి వున్నరందురా-వెంకటేశ
యాడనుంటి విందాఁకనురా ॥

పిక్కటిల్లు చన్నులపై - చొక్కపు నీ వుంగరము
గక్కన నే నద్దుకొందురా - వెంకటేశ
లక్కవలె ముద్ర లంటెరా ॥

నిండఁ బూచిన మావిపై - గండు ఁగోవిల గూయఁగా
నిండిన నీయెలుఁ గంటాను - వెంకటేశ
అండకు నిన్ను రమ్మంటిరా ॥

నీకు వలచిన వలపు - లాకలొత్తె నామతిని
వాకున నేఁజెప్పఁ జాలరా - వెంకటేశ ॥
లోకమెల్లా నెరిఁగినదే

పాయము నీకొక్కనికే - చాయగా మీఁదెత్తితిని
యీయెడఁ గై వాలకుండాను - వెంకటేశ
మాయింటనే పాయకుండరా ॥

ముమ్మాటికి నీ బాసలే - నమ్మివున్నదాన నేను
కుమ్మరించరా నీకరుణ - వెంకటేశ
చిమ్ముఁ జీఁకటెల్ల ఁబాయను ॥ [13-223]

ఇది జానపద బాణిలో విరహోద్దీపకమైన నాయిక తిరువేంకట నాయకుని కోసం ఆలపించిన విరహగీతం.

తాళ్ళపాక అన్నమాచార్యుడే తిరుమలలో కళ్యాణోత్సవాన్ని ప్రారంభించాడని ముందు ప్రస్తావించడం జరిగింది. పెండ్లి వేడుకల్లో వధూవరులను ముత్తైదువులు అనేక రకాలుగా హాస్యంతో పుడికించడం గద్దు. అలాంటిదే క్రింది పెండ్లి పాట.

శ్రీరాగం

పిడికిటి తలఁబ్రాల పెండ్లికూఁతురు కొంత
పెడమరలి నవ్వీనే పెండ్లికూఁతురు ॥

పేరుకల జవరాలె పెండ్లికూఁతురు పెద్ద -
పేరుల ముత్యాలమెడ పెండ్లికూఁతురు
పేరంటాండ్ల నడిమి పెండ్లికూఁతురు విభుఁ
బేరుకుచ్చ సిగ్గువడీఁ బెండ్లికూఁతురు ॥

పెట్టినె పెద్దతురుము పెండ్లికూఁతురు నేఁడె
పెట్టెఁడు చీరలుగట్టెఁ బెండ్లికూఁతురు
గట్టిగ వేంకటపతి కౌఁగిటను వడి -
వెట్టిన నిధానమైన పెండ్లిఁకూతురు ॥ [12-185]

జానపద రీతిలో పెండ్లికూతురుని మగని పేరు అడిగి పుడికించడం ఇత్యాదిగా లౌకిక వినోదాన్ని పై సంకీర్తనలో జతచేశాడు అన్నమయ్య.

పారాణి వళ్ళాన్ని తిప్పుతూ దిష్టితీసేటప్పుడు పాడే పాటలు నివాళులు. వివాహ మహోత్సవాది శుభసమయాల్లో పాడే శోభన, మంగళ, వైభోగ, నివాళి పదాలన్నింటిని తాళ్ళపాకవారు ధవళాలనే పేర్కొన్నారు. అలమేల్మంగ మోముకు స్వామివారి కనుచూపుల్ని 'ముత్తెపునివాళి' గా కీర్తించిన క్రింది కీర్తన నివాళిపదంగానే భావింప బడుచున్నది.

శంకరాభరణం

వలపులు వలపులు వయ్యాళి
    చలమరి మరుఁడును సమేళి ॥

నెలఁత మోమునకు నీకను చూపులు
    నిలువున ముత్తెపు నివాళి
    కొలఁదికి మీరిన గురు కుచములకును
    తొలఁకు నీమనసు దువాళి ॥

పడఁతి కోరికల భావంబునకును
    కడుఁగడు నీతమి గయాళి
    చిడిముడి మగువకు శ్రీవేంకటపతి
    విడువని కూటపు విరాళి ॥ [13-282]

వివాహాల్లో, ఉత్సవాల్లో మంగళాలు పాడడం పరిపాటి.

మంగళకౌశిక

క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని
    నీరజాలయమునకు (యకును?) నీరాజనం ॥

జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు
    నెలకొన్న కప్పురపు నీరాజనం
    అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
    నిలువు మాణిక్యముల నీరాజనం ॥

పగటు శ్రీవేంకటేశు పట్టపు రాణియై
నెగడు సతికళలకును నీరాజనం
జగతి నలమేల్మంగ చక్కదనములకెల్ల
నిగుడు నిజశోభనపు నీరాజనం ॥ [26-295]

ఇది దివ్య నాయికయైన అలమేల్మంగకు అన్నమయ్య సమర్పిస్తున్న నిజశోభనపు నీరాజనకీర్తన.

ఇలా వివిధ ప్రసిద్ధ జానపదగేయరీతుల్లోను దివ్యనాయిక అలమేల్మంగను కీర్తించాడు అన్నమయ్య.

అధ్యాత్మ శృంగార తత్త్వ ప్రధానమైన అన్నమయ్య అంతరంగంలో అలమేల్మంగ హరి అంతరంగిణి, పరమేశ్వరి, వేదమాత, చక్కని తల్లి, సిరు లొసగే చింతామణి, శ్రీ వెంకటాద్రిని నెలకొన్న నిధానము, పరమాత్మభావములో కీలుబొమ్మ, వేంకటవిభుని ప్రాణ మోహనరాణి, కడుఁగడుముద్దరాలు, కామినిఁ పుట్టుభోగి జవరాలు, వెన్నెలబొమ్మ, చక్కెరబొమ్మ, విలాసాలగని, కామ నిధానంగా కీర్తించబడింది,

చివరగా జగన్మంగళమైన అలమేల్మంగకు మంగళ ఆరతులు.

ఉ॥ మంగళమమ్మకున్ సకల మంగళ మంబుజ నేత్రికిన్ జయా
మంగళ మిందిరాసతికి మంగళ మీ యలమేలుమంగకున్
మంగళమందు నే మఱియు మంగళమందును దేవలోకది
వ్యాంగనలెల్ల నీసతికి నారతులిత్తురు వేంకటేశ్వరా ॥ [వే.శ.28 ప]

★

# అనుబంధం

బౌళి

పసిఁడి చీరవాఁడవు పాలు దచ్చితివి గాన
పసిఁడిఁ బోలినది చేపట్టెను నీ కరము ॥

తొలుతనే చందురుని తోడఁబుట్టు గనుక
పొలుపుఁ జందురు మోము బోలికైనది
కళల చింతామణి కందువ చెల్లెలు గాన
తళుకుమానికపు దంతముల ఁబోలినది ॥

మంచి యైరావతముతో మగువ సైదోడు గాన
ముంచిన కరిగమనము ఁబోలినది
పంచలఁ బారిజాతపు భావపు సోదరి గాన
యెంచఁగ చిగురుఁబోలె నీకె పాదములు ॥

తామెర తొట్టెలలోన తగిలి తానుండు ఁగాన
తామెర కన్నులఁబోలి తనరినది
యీమేర నిన్నిటాఁ బోలి ఇన్ని లక్షణములతో
నీమేన శ్రీవేంకటేశ నెలపై నిల్చినది ॥ [28-64]

రామక్రియ

విచ్చేయవమ్మా వెన్నెలబొమ్మా
మచ్చిక మరుని ధాక మగువ నీ రాక ॥

పంచల పసిండి నిగ్గు వచ్చెదేరే సిగ్గు
వంచన వలపు తీపు వాలుక చూపు
కంచపుం బాలకూడు కాఁకల నీవాడు
మంచపు నీ తలఁబ్రాలు మట్టెల పాదాలు ॥

కోవిల కొసరుఁబాట కొమ్మరో నీమాట
తావుల చెంగావి నీ తళుకు మోవి
గోవ జవ్వాది కరంగు గుబ్బల నీ మెఱుంగు
భావజుదాడి రొదలు పాదపు నీ కదలు ॥

ముద్దుల నీ నగవు చిమ్ముల రతి బిగువు
అద్దలింపుఁ గసరు మోహంపుఁ గొసరు
గద్దరి నీ యలపు వెంకటపతి తలఁపు
అద్దపు నీ మోము మోహన రతిసాము ॥ [4-104]

దేవగాంధారి

మిక్కిలి మేలుది అలమేలుమంగ
అక్కరతో నిన్నుఁజూచీ నలమేలుమంగ ॥

కొచ్చి కొచ్చి యాళా(లా?) పించి కూరిమితోఁ బాడఁగాను
మెచ్చీ నిన్నునిదె యలమేలుమంగ
నెచ్చెలులతోడ నెల్లా నీగుణాలు సారె సారె
అచ్చలాన నాడుకొనీ నలమేలుమంగ ॥

వాడల వాడల నీవు వయ్యాళి ఁదోలఁగాను
మేడలెక్కి చూచీ నలమేలుమంగ
వీడెము చేతఁబట్టుక వెస నీవు పిలువఁగా
ఆడనుండి వచ్చె నీకడ కలమేలుమంగ ॥

యీలీల శ్రీవేంకటేశ ఇంత చనవియ్యఁగాను
మేలములాడీ నలమేలుమంగ
యేలిన నీ రతులను ఇదె తన నేరుపెల్లా
ఆలోచనలు సేసీ నలమేలుమంగా ॥ [25-28]

సాళంగనాట

మెఱుఁగు వంటిది యలమేలుమంగ
అటిముటి నవ్వీని అలమేలుమంగ ॥

పలుచని యెలుఁగున ఁబాడీ నీ మీఁది పాట
మెలుపు ఁగూరిమి నలమేలుమంగ
చెలులతో నీ సుద్ది చెప్పిచెప్పి కరఁగీని
అలయుచు సొలయుచు నలమేలుమంగ ॥

యీడుగా నీ రాకకు నెదురెదురుచూచీ
మేఁడ మీఁద నుండి యలమేలుమంగ
వాడు మోముతో నీపై వలపు చల్లి చల్లి
ఆడీ నాట్యము సారె నలమేలుమంగ ॥

పేరుకొని పిలిచీని ప్రియములు చెప్పి చెప్పి
మేరమీర నిన్ను నలమేలుమంగ
యీరీతి శ్రీవెంకటేశ నిన్నుఁగూడె నేఁడు
ఆరితేరె నన్నిటాను అలమేలుమంగ ॥ [25-355]

శంకరాభరణం

ఏమని పొగడుదుమే యింక నిన్నును
ఆమని సొబగుల అలమేల్మంగ ॥

తెలిఁగన్నుల నీతేటలే కదవే
వెలయుఁగ విభునికి వెన్నెలలు
పులకల మొలకల పొదులివి గదవే
పలుమరుఁ బువ్వుల పానుపులు ॥

తియ్యపు నీ మోవి తేనెలే కదవే
వియ్యపు రమణుని విందులివి
ముయ్యక మూసిన మొలక నవ్వగదె
నెయ్యపుఁగప్రపు నెరిబాగాలు ॥

కైవసమగు నీకాఁగిలే కదవే
శ్రీవేంకటేశ్వరుని సిరినగరు
తావుకొన్న మీ తమకములే కదే
కావించిన మీ కళ్యాణములు ॥ [24-538]

లలిత

కలదింతె మాఁట కంతుని యాఁట
తెలుసుకో నీలోనిదియె పూఁట పూఁట ॥

అలమేలుమంగా హరియంతరంగా
కలితనాట్యరంగ కరుణాపాంగ
చెలువుఁడు వీఁడె చేకొను నేఁడె
వలరాజు తూపులివి వాఁడిమీఁది(దః)వాఁడి ॥

అలినీలవేణి యంబుజ పాణి
వెలయంగ జగదేక విభునిరాణి
కలయు నీపతి వచ్చె గక్కన నిన్నిదె మెచ్చె
పలికిని చిలుకలు పచ్చిమీఁదఁబచ్చి ॥

సిత చంద్రవదనా సింగారసదనా
చతుర దాడిమ బీజచయరదనా
యితవైన శ్రీవెంకటేశుఁడు నిన్నిదె కూడె
తతిఁ దలపోఁతలు తలకూడెఁగూడె ॥ [15-16]

సామంతం

యెంత జాణరో యీకలికి
కాంతుఁడ నీ భోగములకే తగునూ ॥

చెలి నీ కౌఁగిటి చెమటలఁజేసెను
చలువగ నిప్పుడు జలకేలి
అలరుచుఁ గుచముల నదుముచుఁజేసెను
పలుమరు ముదములఁ బర్వతకేలి ॥

పైపైఁ బెనగుచు బాహులతలనే
వైపుగ ఁజేసెను వనకేళి
చూపుల నీపయి సొలయుచు ఁజేసెను
పూఁప వసంతము పూవులకేలి ॥

అరుదుగ నట్టివి యధరామృతముల
సరిఁజేసెను భోజనకేలి
కరఁగుచు శ్రీవేంకటేశ సేసెను
పరగిన రతులనె పరిణయ కేలి ॥ [18-45]

శ్రీరాగం

చిత్తజు వేఁడుకొనరే చెలియలాల
తత్తరించి పతిమీఁది తలపోఁత నున్నది ॥

అతివపై మదనుఁడు అనలాస్త్రమేయఁబోలు
కతలుగ విరహాగ్నిఁ గాఁగీనదే
యితవుగా వరుణాస్త్ర మేయఁబోలు నప్పటిని
తతిఁ జెమటవానలఁ దడియుచునున్నది ॥

అమరగ నంతలో వాయవ్యాస్త్రమేయఁబోలు
వుమరఁబడి నిట్టూర్పులొగి రేఁగెను
జమళిఁగూడఁగ నట్టి శైలాస్త్రమేయఁబోలు
భ్రమసి చనుఁగొండలు బాయిటఁగ్గాన్పించెను ॥

మునుకొని పంతాన సమ్మోహనాస్త్రమేయఁబోలు
మనసు పరవశాన మరపందెను
అనిశము రక్షగా నారాయణాస్త్రమేయఁబోలు
ఘన శ్రీవేంకటేశుఁడు కాఁగిటిలోఁగూడెను । [13-407]

బౌళి

అన్నిటా భాగ్యవంతుఁడవుదువయ్యా
పన్నినందుకల్లా వచ్చు భామ నీకు నిపుడు ॥

పడఁతి మోహరసము పన్నీటి మజ్జనము
కడలేని యాపెసిగ్గు కప్పురకాపు
నిడుద కన్నుఁ జూపులు నించిన తట్టు పునుఁగు
తొడిఁబడ సులభాన దొరకె నీకిపుడు ॥

కామిని కెమ్మోవికాంతి కట్టుకొనే చంద్రగావి
ఆముకొన్న మోహకళలాభరణాలు
దోమటి మాటల విందు ధూప దీప నైవేద్యాలు
కామించి నటువలెనె కలిగె నీకిపుడు ॥

అలమేలుమంగ నవ్వులంగపు నవ్వు దండలు
కలసి వురాన నీకే కట్టిన తాళి
చలపట్టి యీకె రతి సకల సంపదలు
యిలవచ్చె శ్రీవేంకటేశ నీకు నిపుడు ॥ [13-168]

వరాళి

నెలమూఁడు శోభనాలు నీకు నతనికిఁదగు
కలకాలమును నిచ్చకళ్యాణమమ్మా ॥

రామనామమతనిది రామవు నీవై తేను
చామన వర్ణమతఁడు చామవు నీవు
వామనుఁడందురతని వామనయనవు నీవు
ప్రేమపు (౦)(మీ!) యిద్దరికి పేరుబలమొకటే ॥

హరి పేరాతనికి హరిణేక్షణవు నీవు
కరిఁగాచెఁదాను నీవు కరియానవు
సరి జలధిశాయి జలధికన్యవు నీవు
బెరసి మీ యిద్దరికిఁ బేరుబలమొకటే ॥

జలజ నాభుఁడతఁడు జలజముఖివి నీవు
అలమేలుమంగవు నిన్నలమెఁదాను
ఇలలో శ్రీవేంకటేశుఁడిటు నిన్నురానమోచె
పిలిచి పేరుచెప్పెఁబేరుబలమొకటే ॥ [13-280]

భైరవి

భామ నోఁచిన నోము ఫలము సఫలముగాను
కామతాపంబునకు కాండవమునోమె ॥

కొమ్మ చలిమందులకు గొంతిదామెర నోమె
కమ్మఁదావులకు ఘను గౌరి నోమె
నెమ్మతిని కన్నీట నిండుఁ గొలఁకులు నోమె
ముమ్మడించిన వగల ముచ్చింత నోమె ॥ ॥భామ॥

చెదరు గందంబునకు చిట్టిబొట్టు నోమె
కదియు పులకలకు మొలకల నోము నోమె
ముదిత మాటాడకిదె మోనదాగెలు నోమె
పొదలు చెమటలకు నినువుల నోము నోమె ॥

నెలఁత మొగమునకు వెన్నెల మించులటు నోమె
వెలయుఁగాంతికి వీధివెలుగు దా నోమె
ఎలమితోఁదిరు వేంకటేశుఁగూడి
లలితాంగి నిచ్చకళ్యాణంబు నోమె ॥ [12-127]

దేశాక్షి

సతి నిన్ను గెలిచెను జవ్వనపు గరిడిలో
మతిలోన మెచ్చి మెచ్చి మన్నించు రమణుఁడా ॥

కనుసూటి వలపూ కాంత చూచిన చూపు
కొనకెక్కె మరుఁడదె గురులేసెను
మొనకత్తిసామూ మొలువాఁడి కొనగోరు
పెనఁగి చెక్కులనొత్తి పేరము వారెను ॥

చేసూటి వలపూ చెలి కాఁగిలించినది
బాసతోనే కాయజుఁడు పందెమాడెను
మూసిదింపు మొరఁగూ ముంచిన పయ్యెదకొంగు
ఆసలు నీకుఁజూపి ఆయాలు రేఁచెను ॥

మొగసూటివలపూ మోహపు రమణినవ్వు
తగవుతో మదనుఁడు దారగట్టెను
అగపడి శ్రీవేంకటాధిప నీవు గూడితి
జగడమింతయుఁ దీరిచనపు చేకొనెను ॥ [26-517]

సాళంగనాట

యిట్టి భాగ్యము గంటిమి యిద్దరూ బదుకరయ్యా
పట్టము గట్టుకొంటివి పచ్చిదేరె నయ్యా ॥

చెలియ తోడే నీకు సింహాసనపుగద్దె
అలరుఁజూపులె రత్నాభిషేకాలు
చలుపైన నవ్వులే ఛత్ర చామరములు
కలిగె నీకింక నేమి గావలె నయ్యా ॥

చనుఁగవలే నీకు సామ్రాజ్య దుర్గములు
నినుపు మోవితేనెలు నిచ్చబోనాలు
వొనరిన కౌఁగిలే వుండెడి నీ నగరు
యెనయ నచ్చె నీ భాగ్య మీడెరె నయ్యా ॥

రతి చెనకులే నీకు రవణపు సొమ్ములు
సతతపుఁగూటమే సర్వసంపద
యితవై శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సతమాయ మమ్ము నేలి జాణవైతివయ్యా ॥ [18-76]

శ్రీరాగం

అడుగవయ్యా వరములాపె నేమైనా నీవు
బడి బడి నిదివో ప్రత్యక్షమాయ నీకు ॥

చెలయపేరే నీకు సేసే జపమంత్రములు
కలసేటి సన్నలే యంగన్యాసాలు
ములువాఁడి కొనగోరి మోపులే నానాముద్రలు
ఫలియించెఁదపమాపె ప్రత్యక్షమాయ నీకు ॥

ఆపెపైఁజల్లే వలపదే తర్పణజలము
దీపించు నవ్వు పాయస దివ్యహోమము
దాపగు నీయధరామృతమే మంచిభోజనము
నీపాలఁబ్రత్యక్షమాయ నెలఁత యిదె నీకు ॥

పొందుల కాఁగిటి రతి పురశ్చరణ ఫలము
అంది యాపె చక్కని రూపది యంత్రము
యిందునె శ్రీవేంకటేశ యిటు నన్నుఁగూడితివి
అందమై ప్రత్యక్షమాయ నప్పటిఁదానె నీకు ॥ [22-518]

దేసాళం

పెనుఁబండుగలు సేసి పిలిపించె నిన్నుమాపె
పెనఁగీఁజిత్తపు చింత పెనులంపటములు ॥

చెవులఁబండుగ సేసె చెలి నీసుద్దులు విని
నవకపు వేడుక నిన్నటిమాపె
తివిరి వేగుదాఁకా దీపాళి పండుగ సేసె
జవకట్టి నినుఁబాసి జాగరాలను ॥

కన్నులపండుగ సేసె కలికి మేడపై నుండి
నిన్నుఁదప్పకిట్టె చూచి నిన్నమాపె
వున్నతి నొక నిమిషముగాది పండుగసేసె
తన్నుఁదానె తనలోని తమకానను ॥

నిచ్చ పండుగలు సేసె నీతోడి మాటలనె
నెచ్చెలి యల్లంతనుండి నిన్నమాపె
పచ్చిగా లక్ష్మీదేవి పండుగలు సేసెనిదె
యిచ్చకుఁడ శ్రీవేంకటేశ నిన్నుఁగూడెనూ ॥ [17-184]

రామక్రియ

చూడరమ్మ యిటువంటి సుదతులుతులేరెందు
యేడనైన నిటువంటి యింతులు వుట్టుదురా ॥

ముదిత నడపులలోని మురిపెమే వెయిసేసు
కొదమ గుబ్బల తీరు కోటివేలు సేసు
సుదతి బిత్తరిచూపు సొన్నటంకాలే సేసు
అదర బింబము తీరు ఆరువేలు సేసు ॥

సన్నపు నడుములోని సైకమే లక్ష సేసు
పన్నుగాఁ బిరుఁదు వన్నె పదివేలు సేసు
యెన్నిక మెఱుఁగుఁదొడలెంత ధనమైనఁజేసు
నున్నఁగా దువ్వినకొప్పు నూరువేలు సేసునే ॥

అంగన భాగ్యమెట్టిదో అతిమోహమై తిరు -
వెంగళరాయనికృప వేవెలు సేసునే
బంగారు చవికెలోఁబడఁతి గూడిన సొంపు
రంగుగాఁ జెలియరూపు రాజ్యమెల్లఁజేసునే॥ [12-304]

శంకరాభరణం

మనను బండారము మగువమేను
పొదిగొన్న వలపులఁబొసఁగెఁగాన॥

మరుని యాయుధశాల మరునికొప్పు
తొరలించి విరులెల్లాఁదురిమెఁగాన
యిరవై కీరపు (ము?)లాయ మీపెగళము
సరసపుమాఁటలెల్లా జరపెఁ గాన॥

కాముని సాము గరిడి కాంత వురము
ఆమని చను సంగడా లమరెఁగాన
ప్రేమపుఁగేళాకూళి గంభీరనాభి
తేమ చెమటల చేత దిగుపారెఁగాన॥

కాంతుని వేఁట పొలము కన్నె పిఱుఁదు
బంతి మొలనూళ్ల వోఁగు వారెఁగాన
అంతటివానితల్లి యీయలమేల్మంగ
యింతలో శ్రీవేంకటేశు నెనసెఁగాన॥ [29-196]

పాడి

ఎంతమోహమో నీకి ఇంతి మీఁదను
వింత వింత వేడుకల విఱ్ఱవీఁగేవు॥

తరుణిగుబ్బలు నీకుఁ దలగడ బిల్లలుగా -
నొరగు కొన్నాఁడవు వుబ్బిన నీవు
దొరవై పయ్యెదకొంగు దోమతెర బాగుగ
సరుగ మాఁటు సేసుక జాణవై వున్నాఁడవు॥

భామిని తొడలు నీకు పట్టెమంచము లాగున -
నాముకొని పవ్వళించే వప్పటి నీవు
గోముతోడ వట్టుచీర కుచ్చెల పరపుగాఁగ
కామించి ఇట్టె కోడెకాఁడవై వున్నాఁడవు ॥

వనిత కాఁగిలి నీకు వాసన చప్పరముగ -
నునికి సేసు కున్నాఁడ వొద్దికై నీవు
యెనసితివి శ్రీవేంకటేశ యలమేలుమంగను
అనిశము సింగారరాయఁడవై వున్నాఁడవు ॥ [24-139]

శ్రీరాగం

ఎత్తరే ఆరతులీపె కింతులాల
హత్తెను శ్రీవేంటేశు కలమేలుమంగ ॥

హరి వురముపై సొమ్ము అరతఁగట్టిన తాళి
సరిలేని దేవుని సంసార ఫలము
సిరులకుఁ బుట్టినిల్లు సింగారముల విత్తు
మెరఁగుఁబోడి యలమేలుమంగ ॥

పరమాత్మునికి నాత్మభావములో కీలుబొమ్మ
కెరలుచు నితఁడు భోగించే మేడ
సరసపు సముద్రము సతమైన కొంగుపైఁడి
అరిది సంపదలది యలమేలుమంగ ॥

శ్రీవేంకటేశుని దేవి చిత్తజుఁగన్నతల్లి
యీ విభుని కాఁగిటిలో యేచిన కళ
బూవపు పెండ్లి మేలు పొందిన నిధానము
ఆవల నీవల నీపె యలమేలుమంగ ॥ [14-84]

* * *

# ఉపయుక్త గ్రంథసూచి

అన్నమాచార్య చరిత్రము —శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ [పరిష్కర్త]
తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ
(1978)

అన్నమయ్య పదకవితల్లో —డా॥ కె. వాణి
అలంకారాల పరిశీలన అముద్రిత పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసం
ఎస్.వి. యూనివర్సిటీ (1982

అన్నమాచార్యుల —శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి (సం)
సంకీర్తనలు [సం. 1] తి.తి.దే. ప్రచురణ, 1977

అన్నమాచార్యుల —శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి (సం)
సంకీర్తనలు [సం. 2] తి.తి.దే. ప్రచురణ, 1977

తాళ్లపాక అన్నమయ్య —శ్రీ కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి (సం)
పాటలు తి.తి.దే. ప్రచురణ, 1976

తాళ్లపాకవారి —శ్రీ వి. విజయరాఘవాచార్యులు,
లఘు కృతులు [సం. 1] శ్రీ జి. ఆదినారాయణనాయుడు (పరిష్కర్తలు)
తి.తి.దే. ప్రచురణ, 1935

తాళ్లపాక కవుల కృతులు — డా॥ వేటూరి ఆనందమూర్తి
వివిధ సాహితీ ప్రక్రియలు రీడర్, నిజాం కాలేజి, హైదరాబాదు

తాళ్లపాక కవుల పదకవితలు —డా॥ వేటూరి ఆనందమూర్తి
భాషాప్రయోగ విశేషాలు రీడర్, నిజాం కాలేజి, హైదరాబాదు

తిరుపతి చరిత్రము —శ్రీ దీవి రంగనాథాచార్యులు
తి.తి.దే. ప్రచురణ (1978)

తెలుగు జానపదగేయ —ఆచార్య బి. రామరాజు
సాహిత్యం ఉస్మానియా యూనివర్శిటీ, హైదరాబాదు

దయాశతకము —వేదాంతదేశికర్
శ్రీ వేదాంతదేశిక సంప్రదాయ సుధాస్వాదినీసభ
తిరుపతి

లక్ష్మీకటాక్షము —శ్రీ జి. టి. సూరి (వ్యాఖ్యాత)
తి.తి.దే. ప్రచురణ, 1982

వేంకటేశ్వరశతకము —శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు
వ్రాతపతి, వావిళ్ల ప్రచురణ, 1947
మద్రాసు

సంకేత పదకోశము —శ్రీ రవ్వా శ్రీహరి
మురళీపవర్ ప్రెస్, 1973
హైదరాబాదు

శ్రీనివాసమంగాపురం మరియు మన ఆలయముల చరిత్ర —శ్రీ గోపీకృష్ణ
తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ 1980

శ్రీ వేంకటేశ్వరవైభవము —శ్రీ పణ్డిత వేదాన్తం జగన్నాథాచార్యులు
తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ, 1977

శ్రీ వేంకటేశ్వర సాహిత్య సమీక్ష —శ్రీ ఆర్. నాగభూషణం
అముద్రిత ఎమ్.ఫిల్. సిద్ధాంతగ్రంథం
ఎస్.వి. యూనివర్సిటీ, 1981.

**Alamel Mangapuram** —V. Ramaswamy Iyengar
T.T.D., 1980

**History of Tirupati** —T.K.T. Veeraraghavacharyulu
T.T.D., 1982

**Temple at Tiruchanur** —Sapthagiri (Eng.)
T.T.D., June 1976

T. T. D. Religious Publicatious Series No. 297



Published by S Lakshminarayana, I.A.S., Executive Officer, T.T.Devasthanams
and Printed at T. T. D. Press, Tirupati. - C. 2000 20-5-86